E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 01-10-2025 (వారం) బుధవారం    హైదరాబాద్ పేజీలు–6    e-kaburu.com



ప్రభుత్వ భూములు కాజేసే యత్నం 3లో

## స్థానిక పోరులోకి పార్టీలు




- షెడ్యూల్ విడుదలతో వ్యూహాలకు పదును
- 70–80 శాతం సీట్లు గెలవాలన్నపట్టుదలతో కాంగ్రెస్.. ప్రభుత్వ వైఫల్యాలే బీఆర్ఎస్ ప్రచారాస్త్రాలు
- కేంద్ర పథకాలపై బీజేపీ ఆశలు

తరువాయి 2లో

## త్రివిధ దళాల ఏకీకరణ తప్పనిసరి

- 'సిందూర్'లో విజయానికి ఇదే కారణం: రాజ్‌నాథ్.



తరువాయి 2లో

## 5వ తేదీ నాటికి అభ్యర్థుల పేర్లు పంపండి



- ఒక్కో జడ్పీటీసీ స్థానానికి ముగ్గుర్ని ప్రతిపాదించాలి
- మంత్రులు, డీసీసీ అధ్యక్షులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన

తరువాయి 2లో

## తొలి మ్యాచ్‌లో లంకపై ఘనవిజయం

» 6లో



## ట్యాంక్‌బండ్‌పై ఘనంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు

- అమరవీరుల స్తూపం నుంచి బతుకమ్మలతో మహిళల ర్యాలీ
- ఆడిపాడిన మంత్రి సురేఖ.. ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు



తరువాయి2లో

## గృహిణులు, ఖైదీలు మళ్లీ చదువుతున్నారు


- అంబేడ్కర్ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- గోరటి వెంకన్న, ప్రేమ్ రావత్‌లకు గౌరవ డాక్టరేట్ల ప్రదానం

తరువాయి 2లో



## జ్ఞాపకాలను మోయడం ఆపేశాను

» 5లో



## మళ్లీ ట్రంప్ టారిఫ్ బాంబు



- కలపపై 10 శాతం, ఫర్నిచర్‌పై 25 శాతం సుంకాలు
- ఈ నెల 14 నుంచే అమల్లోకి...

తరువాయి 3లో

## పేదరికమే పెద్ద శత్రువు



- దేశంలోని ఆత్మహత్యల్లో 66.2%వారివే..
- నిరుద్యోగమూ కారణమే..
- మొత్తం 1,71,418 మంది ఆత్మహత్య

తరువాయి 3లో

## సీబీఎస్ఈ పాఠశాలల దూకుడు



- రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 4060 వరకు కొత్త బడులు
- రాష్ట్రేతర బోర్డుల్లో 6.50 లక్షలకు చేరిన విద్యార్థుల సంఖ్య

ఈకబురు, హైదరాబాద్, :రాష్ట్రంలో సీబీఎస్ఈ పాఠశాలల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల్ని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ లాంటి ఇతర బోర్డు పాఠశాలల్లో చదివించేందుకు ఆసక్తి చూపుతుండటమే అందుకు కారణమని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రైవేట్ సీబీఎస్ఈ పాఠశాలలు (ఇండిపెండెంట్) భారీగా ఏర్పాటవుతున్నాయి. రాష్ట్రంలో రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఖ్య పెరగకున్నా వాటిల్లో విద్యార్థుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది.

తరువాయి 2లో

## బెయిలు మంజూరీలో లొసుగులు.. జడ్జీలకు పునశ్చరణ దండన విధించిన సుప్రీం



తరువాయి 3లో

» 3లో

## హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం





## 10 గ్రాములు రూ.1.20 లక్షలు



» 4లో

## 53 లక్షలు కాదు.. 80 లక్షల టన్నులు కొనాలి



- ధాన్యం సేకరణకు కేంద్రం సహకారం అవసరం
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి మంత్రి ఉత్తమ్ లేఖ

ఈకబురు, హైదరాబాద్, : భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) ఈ వానాకాలం సీజన్‌కుగాను 53లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతి ఇచ్చిందని, అయితే రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి పెరుగుతున్న నేపథ్యంలో.. 80లక్షల టన్నుల సేకరణకు అనుమతివ్వాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి మంత్రి లేఖ రాశారు. ఆ లేఖ ప్రతిని హైదరాబాద్‌లో మీడియాకు ఆయన విడుదలచేశారు. 80 వేల టన్నులు అనేది దేశ చరిత్రలోనే పెద్ద లక్ష్యమని అన్నారు. ధాన్యం సేకరణకు రూ.20 వేల కోట్లు అవుతుందని, బోనస్, రవాణా ఖర్చులు కలిపి రూ.24 వేల కోట్ల నుంచి రూ.26 వేల కోట్లకు పెరుగుతుందని, ఇంత భారీ మొత్తంలో ఏ ప్రభుత్వం కూడా రైతులకు వెచ్చించలేదని అన్నారు.

తరువాయి 2లో

మొదటి పేజీ తరువాయి

# ట్యాంక్‌బండ్‌పై ఘనంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు



ఈ-కబురు, హైదరాబాద్ : ట్యాంక్‌బండ్‌పై మంగళవారం సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మలతో వచ్చి ఆడిపాడారు. మహిళలు అమరవీరుల స్మారక చిహ్నం నుంచి ర్యాలీగా ట్యాంక్‌బండ్ పైకి చేరుకున్నారు. రంగు రంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో పెద్దఎత్తున హాజరై చిన్నాపెద్ద అన్న తేడా లేకుండా సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో సందడి చేశారు. తెలంగాణ టూరిజం శాఖ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ బతుకమ్మ ఉత్సవాలకు తెలంగాణ సాంస్కృతిక శాఖకు చెందిన కళాకారులు.. బోనాలు, ఒగ్గుడోలు, డప్పు వాయిద్యాలు, చిందు, యక్షగానంతో ట్యాంక్‌బండ్ పైకి వచ్చే బతుకమ్మలకు స్వాగతం పలికారు. ఈ ఉత్సవాల సందర్భంగా దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఇతర కార్పొరేషన్ల చైర్మన్లతో కలిసి ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ ఆడి పాడారు. రాష్ట్రంలో బతుకమ్మ ఉత్సవాలు పర్యాటక శాఖ చేసిన కృషి ఫలితంగానే గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కిందని కొండా సురేఖ అన్నారు. బతుకమ్మ ఆటను గతంలో మాదిరిగా పెద్దవాళ్లు రూపకల్పన చేసిన పాటలతో కాకుండా పాశ్చాత్య పాటలతో ఆడుతున్నారని, ఇది మంచిది కాదని, పాత పద్ధతిలోనే ఆడాలని సూచించారు. ఒకవేళ బతుకమ్మ ఆటను పాశ్చాత్య పాటలతో ఆడుకోవాలనుకుంటే ప్రైవేటు కార్యక్రమాల్లో ఆడుకోవొచ్చునని చెప్పారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, టూరిజం ఎండీ క్రాంతి, మహిళా కమిషన్ చైర్మన్ శారద, నగర్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వెన్నెల గద్దర్, నిర్మలారెడ్డి, పంజాల అలేఖ్య, కాల్వ సుజాత హాజరయ్యారు. రాత్రి వరకు బతుకమ్మల చుట్టూరా ఆడిపాడిన మహిళలు బతుకమ్మ ఘాట్ వద్ద హుస్సేన్‌సాగర్‌లోకి వదిలారు.

మొదటి పేజీ తరువాయి

## సీబీఎస్ఈ పాఠశాలల దూకుడు



హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో...

రాష్ట్రంలో 2016-17 విద్యా సంవత్సరంలో మొత్తం 250 సీబీఎస్ఈ పాఠశాలలు ఉండగా.. అందులో ప్రైవేటువి 210. 2025-26లో మొత్తం బడుల సంఖ్య ఏకంగా 650కి చేరుకోగా.. ప్రైవేటువి దాదాపు 565 ఉండటం విశేషం. రాష్ట్రంలో ఏటా 40-60 కొత్తగా వస్తున్నాయి.

హైదరాబాద్ జిల్లాలో 129, రంగారెడ్డిలో 239, వరంగల్‌లో 52, మహబూబ్‌నగర్, ఖమ్మంలలో 26 చొప్పున పాఠశాలలు ఉన్నాయి. ఆదిలాబాద్‌లో 13 ఉండటం గమనార్హం. నిర్మల్, వనపర్తి లాంటి జిల్లాల్లోనూ వచ్చాయి.

రాష్ట్రంలో ఏడెనిమిది జిల్లాల్లో మాత్రమే సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలు లేవు. రాష్ట్ర విద్యాశాఖ పరిధిలో 11,500 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఆ సంఖ్య దశాబ్దకాలంగా మారటం లేదు. విద్యార్థుల సంఖ్య మాత్రం పెరుగుతోంది.

రాష్ట్రంలో మొత్తం 60 లక్షల మంది పాఠశాల విద్యార్థులు ఉండగా.. అన్ని రకాల బోర్డుల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో 38 లక్షల మంది ఉన్నారు. వాటిల్లో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, కేంబ్రిడ్జి తదితర బోర్డుల్లో విద్యార్థుల సంఖ్య 6.50 లక్షలకు చేరుకున్నట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో 2025లో ఒక్క సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలు రాసిన వారి సంఖ్యే 51 వేలకుపైగా ఉండటం గమనార్హం.

రాష్ట్రంలోనే కాదు... దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో సీబీఎస్ఈ బడుల సంఖ్య పెరుగుతోంది. 2020లో మొత్తం 22,561 పాఠశాలలు ఉండగా.. 2025లో 31,208కి చేరడం విశేషం.

ఎందుకీ ఆసక్తి..?

సీబీఎస్ఈ అనుబంధ గుర్తింపు పొందాలంటే నగరాల్లో కనీసం ఎకరం, గ్రామీణ ప్రాంతాల్లో రెండు ఎకరాల స్థలం ఉండాలి. దానివల్ల భవనాలు, ఆట స్థలం, ఇతర సౌకర్యాలు తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. దానికితోడు ఈ బడుల్లో చదివిస్తే హిందీ, ఆంగ్లం బాగా వస్తాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యాపించింది. దాంతో ఫీజు అధికంగా ఉన్నా అన్ని వర్గాల వారు సైతం వాటిల్లో చదివిస్తున్నారు. డిసెంబరు, జనవరిలోనే తర్వాత

మొదటి పేజీ తరువాయి

# స్థానిక పోరులోకి పార్టీలు

ఈకబురు, హైదరాబాద్, :స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి. మెజారిటీ స్థానాల్లో గెలిచి సత్తా చాటాలనే లక్ష్యంతో కసరత్తు ముమ్మరం చేశాయి. జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆధిపత్యం సాధించేందుకు అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌తోపాటు సర్వ శక్తులూ కూడదీసుకుంటున్నాయి. ఇతర పార్టీలు సైతం ఎన్నికలపై దృష్టి నిలిపాయి.

70-80 శాతం సీట్లు గెలిచేలా..

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎట్టిపరిస్థితుల్లో కనీసం 70 నుంచి 80 శాతం స్థానాలు సాధించి మిగతా పార్టీలపై ఆధిపత్యం సాధించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వ పాలన తీరుపై ప్రజల్లో సానుకూల స్పందన ఉందని, కచ్చితంగా మంచి ఫలితాలు సాధిస్తామని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల పర్యవేక్షణలో పార్టీ ఎమ్మెల్యేలకు గెలుపు బాధ్యతలను అప్పగించనున్నారు. ఈ ఎన్నికల కోసం జిల్లాకు ఒక పరిశీలకుడిని నియమించనున్నారు. ఎన్నికల పర్యవేక్షణ, ప్రచార బాధ్యతలను సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు తీసుకోనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు, పార్టీ బలపరిచే వారిని గెలిపించే పూర్తి బాధ్యతను పార్టీ ఎమ్మెల్యేలపైనే మోపేందుకు అధిష్ఠానం సిద్ధమైంది.

ఈ ఎన్నికల కోసం క్షేత్రస్థాయిలో జిల్లా కమిటీలను వేసి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా, ప్రజలకు సన్నబియ్యం పంపిణీ, సాదా బైనామాలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన తదితరాలను ప్రచారాస్త్రాలుగా చేసుకోనుంది. గత బీఆర్ఎస్ పాలన తీరును ఈ ఎన్నికల్లో ఎండగడతామని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. ప్రాంతాన్ని బట్టి స్థానిక అంశాలపై కూడా ప్రధానంగా దృష్టిపెడతామని అంటున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపైనే బీఆర్ఎస్ ఫోకస్

గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలను లేవనెత్తి, కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలమైందని ప్రజలకు చూపించాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ భావిస్తోంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పల్లెల సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటే, కాంగ్రెస్ వాటన్నింటినీ నిర్లక్ష్యం చేసిందని ప్రచారం చేయాలని నిర్ణయించింది. ఈ వ్యూహంతోమంచి ఫలితాలు సాధిస్తామనే విశ్వాసాన్ని ముఖ్యనేతలు వ్యక్తం చేస్తున్నారు. ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే ఎన్నికల కసరత్తు చేపట్టేలా టెలి కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. జిల్లాలు, మండలాలు, గ్రామపంచాయతీలవారీగా ఇతర పార్టీల నుంచి వచ్చిన అసంతృప్తులను తమ పార్టీలో చేర్చుకోవటంపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

కేంద్ర పథకాలపైనే ఆశలు

స్థానిక ఎన్నికల్లో బీజేపీ ప్రధానంగా కేంద్ర పథకాలపైనే ఆశలు పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగేందుకు ఈ ఎన్నికలు మంచి అవకాశంగా భావిస్తోంది. అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని నిర్ణయించింది. మండల, అసెంబ్లీ, జిల్లా స్థాయిల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వివిధ కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించింది. గత 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి రూ.12 లక్షల కోట్లు ఇచ్చిందని విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించింది.కేంద్ర పథకాల వల్ల తెలంగాణకు వివిధ రూపాల్లో లభించిన ప్రయోజనాలు, వివిధ శాఖలు, రంగాలకు సంబంధించి అందిన సహాయం గురించి ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. ముఖ్య నాయకులు హైదరాబాద్‌కు పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేయాలని రాష్ట్ర నాయకత్వం ఆదేశించింది. పాలనలో బీఆర్ఎస్, కాంగ్రెస్ విఫలమయ్యాయని బలంగా ప్రచారం చేసేందుకు వ్యూహాలు రచిస్తోంది.

# గృహిణులు, ఖైదీలు మళ్లీ చదువుతున్నారు




ఈకబురు, హైదరాబాద్, :హైదరాబాద్: 'నిరక్షరాస్యులైన గృహిణులు, యువత, శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు దూరవిద్య ద్వారా విద్యనభ్యసిస్తున్నారు, డిగ్రీ పట్టాలతో వారు కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాల'ని రాష్ట్ర గవర్నర్, డాక్టర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం కులపతి జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మంగళవారం ఈ విశ్వవిద్యాలయ 26వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.. అంబేద్కర్ వర్సిటీ నుంచి పట్టాలు పొందిన వారిలో చాలామంది ఉన్నతస్థానాలను అందుకున్నారని, భవిష్యత్ అవసరాలకనుగుణంగా వర్సిటీలో డిజిటల్ బోధన అందిస్తున్నారని తెలిపారు. (ఇగ్నో) ఉపకులపతి ప్రొఫెసర్ ఉమా కాంజీలాల్ మాట్లాడుతూ.. విద్యవల్లే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని.. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో విద్యార్థులు దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని పేర్కొన్నారు. దేశంలోనే తొలి సార్వత్రిక విశ్వవిద్యాలయంగా పేరొందిన డాక్టర్ అంబేద్కర్ వర్సిటీ అధునాతమైన పరిశోధనలు, భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే కోర్సులను నిర్వహిస్తోందన్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాలకు విద్యనందించడమే తమ లక్ష్యమని, దేశవ్యాప్తంగా ఇప్పటి వరకూ 25 లక్షల మంది వర్సిటీలో ప్రవేశాలు పొందారని అన్నారు. ఈ సందర్భంగా గేయ రచయిత, గాయకుడు గోరటి వెంకన్న, శాంతి ప్రచారకులు ప్రేమ్ రావత్‌లకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. బంగారు పతకాలు సాధించిన 82 మంది విద్యార్థులను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. డిగ్రీ పూర్తి చేసుకున్న 28 మంది ఖైదీల్లో 13 మందికి ఆయన స్వయంగా పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి, ఆచార్యులు పాల్గొన్నారు.


# 53 లక్షలు కాదు.. 80 లక్షల టన్నులు కొనాలి

కేంద్ర ప్రభుత్వం సేకరణ లక్ష్యం పెంచాలని, అదనపు నిల్వ, రవాణా సదుపాయాలు కల్పించాలని, డెలివరీ నిబంధనలు సడలించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలోని గోదాముల్లో నిల్వలు పేరుకపోయాయని, దీంతో స్టోరేజీ సమస్య ఎదురవుతోందని, సీఎంఆర్ డెలివరీని పెంచాలంటే రాష్ట్రంలోని బియ్యం నిల్వలను తరలించాలని, తక్షణమే 300 రైల్వే రేకులు ఏర్పాటుచేయాలని ప్రహ్లాద్ జోషికి లేఖలో విన్నవించారు. రాష్ట్రంలో 22.61 లక్షల టన్నుల ఎఫ్‌సీఐ గిడ్డంగుల నిల్వ సామర్థ్యం ఉంటే.. 21.72 లక్షల టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయని తెలిపారు. కేవలం 89వేల టన్నుల బియ్యం పట్టే స్థలమే మిగిలి ఉందని తెలిపారు. యాసంగి 2024 25లో 74 లక్షల టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని, కానీ కేంద్రం 53లక్షల టన్నులకు మాత్రమే అనుమతి ఇచ్చిందని, మిగిలిన 10లక్షల టన్నుల బియ్యాన్ని ముడి బియ్యం రూపంలో కాకుండా, బాయిల్డ్ రైస్ (ఉప్పుడు బియ్యం) రూపంలో తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈ బియ్యం సేకరణ గడువు ఈ ఏడాది అక్టోబరు 31 వరకే ఉన్నదని, ఇంకా 30లక్షల టన్నుల బియ్యం బకాయిలున్న నేపథ్యంలో సీఎంఆర్ డెలివరీ గడువును మూడు నెలలు పొడిగించాలని, 2026 జనవరి 31 వరకు సమయం ఇవ్వాలని కేంద్ర మంత్రిని ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు.

202425 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 8 లక్షల టన్నుల బాయిల్డ్ రైస్‌కు కేంద్రం అనుమతి ఇచ్చిందని, కానీ 7 లక్షల టన్నులు రా రైస్‌మిల్లర్ల వద్ద ఉన్నదని, లక్ష టన్నులు బాయిల్డ్ రైస్ రూపంలో ఉన్నదని, దీనికి కూడా మినహాయింపు ఇవ్వాలని లేఖలో ఉత్తమ్ విజ్ఞప్తిచేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో బాయిల్డ్ రైస్ మాత్రమే సరఫరా చేయాలనే నిబంధనపై అభ్యంతరం వ్యక్తంచేశారు. వానాకాలం సీజన్‌లో ఉత్పత్తి అయ్యే ధాన్యం ముడిబియ్యం తయారీకి అనుకూలమని అందుకే రా రైస్, బాయిల్డ్ రైస్ రెండింటికి అనుమతివ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. బాయిల్డ్‌రైస్ లక్ష్యాన్ని యాసంగి సీజన్‌కు మార్చాలని కోరారు. ఎఫ్‌సీఐ బియ్యాన్ని కిలోకు రూ.24 చొప్పున ఓపెన్ మార్కెట్ సేల్‌లో విడుదల చేయటంతో రైతులకు కిలోకు రూ.16 నుంచి రూ.17 చొప్పున మాత్రమే ధర వస్తోందని, ప్రైవేటు కొనుగోలుదారులు కూడా నిరుత్సాహపడుతున్నారని ఉత్తమ్ తెలిపారు. ఈ నేపథ్యంలో కనీస మద్దతు ధరకు వీలైనంత ఎక్కువ ధాన్యం కొనుగోలుచేయాలని కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. అందుకే ఈ ఖరీఫ్‌లో 4550 లక్షల టన్నుల సన్నధాన్యం, 30 35 లక్షల టన్నుల దొడ్డు ధాన్యం సేకరించేందుకు ప్రణాళిక తయారుచేసినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం సేకరణ తగ్గిస్తే తెలంగాణ రైతులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు.



## త్రివిధ దళాల ఏకీకరణ తప్పనిసరి




ఈకబురు, దిల్లీ: సైన్యం, వాయుసేన, నౌకాదళం ఏకతాటిపైకి వచ్చి పూర్తి సమన్వయంతో పోరాటానికి దిగితే నిర్ణయాత్మక ఫలితాలను సాధించొచ్చనడానికి 'ఆపరేషన్ సిందూర్' ఒక ఉదాహరణ అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. భవిష్యత్‌లో చేపట్టే సైనిక చర్యలన్నింటికీ ఇది గీటురాయి కావాలన్నారు. మంగళవారం ఇక్కడ భారత వైమానిక దళం నిర్వహించిన ఒక సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది మే 710 మధ్య పాకిస్థాన్‌తో జరిగిన ఘర్షణల్లో భారత వాయుసేనకు చెందిన సమీకృత గగనతల ఆదేశిక, నియంత్రణ వ్యవస్థ.. సైన్యానికి చెందిన ఆకాశ్‌తీర్ గగనతల రక్షణ వ్యవస్థ, నౌకాదళ 'త్రిగుణ్'లతో కలిసి పనిచేసిన విధానాన్ని ఆయన ప్రస్తావించారు. ఇది ఉమ్మడి పోరాట స్ఫూర్తికి వెన్నెముకగా నిలిచిందని పేర్కొన్నారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో త్రివిధ దళాలు యుద్ధరంగానికి సంబంధించి ఒక ఏకీకృత చిత్రాన్ని ఆవిష్కరించాయి. దీనివల్ల కమాండర్లు సకాలంలో నిర్ణయాలు తీసుకోవడానికి వీలైంది" అని ఆయన తెలిపారు. మూడు దళాల మధ్య సమన్వయం చాలా అవసరమన్నారు. చర్చలు, సంప్రదాయాలపై అవగాహన, గౌరవం ద్వారానే ఇది సాధ్యమని చెప్పారు. "త్రివిధ దళాల ఏకీకరణను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం. అది కేవలం విధాన నిర్ణయమే కాదు.. వేగంగా మారుతున్న భద్రతా వాతావరణంలో మనుగడ సాగించడానికి అత్యవసరం" అని రాజ్‌నాథ్ తెలిపారు.

మందగమనంలో దేశీయ ఆయుధ తయారీ: ఏకే భారతి

ప్రపంచ పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని.. మన మిత్ర దేశాలు ఎల్లవేళలా మనతో సాంకేతికతను పంచుకుంటాయనే నమ్మకం లేదని వైమానిక దళ ఉప అధిపతి ఎయిర్ మార్షల్ ఏకే భారతి పేర్కొన్నారు. భవిష్యత్తు యుద్ధాల్లో విజయం సాధించాలంటే దేశీయంగా ఆయుధ తయారీ మరింత పెంచడమే మార్గమన్నారు. దీనికోసం పరిశోధనలు, అభివృద్ధిని వేగవంతం చేయాలని మంగళవారం దిల్లీలో జరిగిన ఏరోటెక్ ఇండియా2025 సదస్సులో పేర్కొన్నారు. ప్రస్తుతం స్వదేశీ ఆయుధ తయారీ చాలా తక్కువ మొత్తంలో.. నెమ్మదిగా కొనసాగుతోందన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఇతర దేశాలతో పోటీపటం కష్టమవుతుందని చెప్పారు.

అణు బ్లాక్‌మెయిల్‌కు భారత్ భయపడదు: త్రిదళాధిపతి

భవిష్యత్తులో యుద్ధాల స్వభావం పూర్తిగా మారిపోనుందని త్రిదళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. అణు బెదిరింపులు, రేడియోధార్మిక పదార్థాల ప్రయోగాలు వంటి వాటిని ప్రపంచదేశాలు యుద్ధతంత్రాలుగా వినియోగించే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అణ్వాయుధాల నుంచి వచ్చే రేడియోధార్మిక కాలుష్యాన్ని, జీవాయుధాలను ఎదుర్కోవడంపై భారత్‌లో శిక్షణనివ్వాల్సిన అవసరముందని తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో చికిత్స తీరుతెన్నులపై నిర్దిష్ట విధానాలను రూపొందించుకోవాలన్నారు. మిలిటరీ నర్సింగ్ సర్వీసెస్ 100 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవంలో ప్రసంగిస్తూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రధాని మోదీ తమతో మాట్లాడుతూ.. భారత్ అణు బెదిరింపులకు ఎన్నడూ భయపడకూడదని చెప్పినట్లు వివరించారు. అందుకు అనుగుణంగా రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.

## 5వ తేదీ నాటికి అభ్యర్థుల పేర్లు పంపండి

ఈకబురు, హైదరాబాద్ :హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ స్థానాలకు అభ్యర్థుల పేర్ల జాబితాలను అక్టోబరు 5వ తేదీ నాటికి పీసీసీకి పంపాలని మంత్రులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అన్ని జిల్లాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులతో సంప్రదించి ప్రతి జడ్పీటీసీ స్థానానికి ముగ్గురు బలమైన.. అర్హులైన అభ్యర్థులను గుర్తించాలని స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం జూమ్ ద్వారా సీఎం మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. రేవంత్ మాట్లాడుతూ అన్ని రకాలుగా పరిశీలించి గెలిచే అవకాశాలున్న అభ్యర్థులను 6, 7 తేదీల్లో పీసీసీ ఎంపిక చేస్తుందని వివరించారు. ఎక్కడా చిన్న పొరపాటు కూడా చేయవద్దని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మంత్రులకు సీఎం సూచించినట్లు సమాచారం. ఇప్పటి నుంచే ప్రచారంపై నేతలంతా దృష్టిపెట్టాలని ఆయన చెప్పినట్లు నేతలు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రేవంత్‌రెడ్డి సూచించారని పార్టీవర్గాలు వెల్లడించాయి.

ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక: మహేశ్‌కుమార్‌గౌడ్

బీసీ రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు, జీఓ జారీతో వెనుకబడిన వర్గాలకు జరిగే మేలు గురించి చెప్పాలని నిర్ణయించినట్లు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. అన్ని జడ్పీటీసీ స్థానాలకు జిల్లా ముఖ్యనేతలు ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఎంపిక చేయాలని, ఎక్కడైనా భిన్నాభిప్రాయాలు తలెత్తితే పీసీసీ తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన వివరించారు. అభ్యర్థుల ఎంపిక మొదలుకుని ప్రచారం, గెలుపు వరకు అందరూ సమష్టిగా పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎంపీటీసీ స్థానాలకు ఎక్కడికక్కడ జిల్లా నేతలే అభ్యర్థులను ఎంపిక చేయాలని, ఎక్కడైనా పోటీ అధికంగా ఉంటే పీసీసీ దృష్టికి తేవాలని సమావేశంలో నిర్ణయించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. నామినేషన్ల స్వీకరణ ప్రారంభమయ్యేలోగా అభ్యర్థుల ఎంపిక పూర్తి చేయాలని పార్టీ యోచిస్తోంది.


# ప్రభుత్వ భూములు కాజేసే యత్నం

**పట్టాలు నమ్మశక్యంగా లేవు**
**హక్కులు నిరూపించుకోలేకపోయారు**
**కొండాపూర్ భూములు ప్రభుత్వానివే: హైకోర్టు**

ఈకబురు, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లో వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాజేయాలన్న ప్రైవేటు వ్యక్తుల ప్రయత్నాలకు హైకోర్టు అడ్డుకట్ట వేసింది. కొండాపూర్ సర్వే నం.59లోని 57.09 ఎకరాలు ప్రభుత్వానివేనంటూ హైకోర్టు ఇటీవల తీర్పు వెలువరిస్తూ రెండు దశాబ్దాల వివాదానికి తెర దించింది. రికార్డులన్నింటినీ పరిశీలిస్తే విలువైన ప్రభుత్వ భూమిని కాజేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు స్పష్టమవుతోందని వ్యాఖ్యానించింది. కొండాపూర్ భూములు ప్రైవేటు వ్యక్తులవేనని, వారికి ఒక్కొక్కరికి 3 ఎకరాల చొప్పున ఉందంటూ, వారి పేరున మ్యుటేషన్ చేయాలంటూ సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ 2002లో ప్రభుత్వం పలు అప్పీళ్లు దాఖలు చేసింది. వీటిపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. 1961 డిసెంబరు 13న తహసీల్దారు లావుణి నిబంధనల కింద తాత్కాలిక పట్టా మంజూరు చేశారంటూ ప్రైవేటు వ్యక్తులు చెబుతున్నారని, లావుణి నిబంధనల్లో జిపట్టా ఫారంతో వీరికున్న పట్టాకు పొంతనలేదన్నారు. అసలు తాత్కాలిక పట్టా అన్న నిబంధనే లేదన్నారు. పైగా పట్టాపై డిసెంబరు 21న తహసీల్దారు సంతకం చేశారని, ఈ సందేహాలను నివృత్తి చేయడంలో ప్రైవేటు వ్యక్తులు విఫలమయ్యారని తెలిపారు. 1958లో ఎసైన్‌మెంట్ భూముల కేటాయింపునకు ప్రభుత్వం కొత్త విధానం తీసుకువస్తూ జీవో 1406 జారీ చేసిందన్నారు. అందువల్ల 1961లో అమల్లో లేని లావుణి నిబంధనల కింద పట్టా జారీ చేసే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. 1961లో హైదరాబాద్‌కు 10 మైళ్ల వరకు ఎసైన్‌మెంట్‌పై నిషేధం ఉందని, కొండాపూర్ 10 మైళ్లలోపే ఉందని, అందువల్ల పట్టా జారీచేసే అవకాశం లేదన్నారు. నూతన ఎసైన్‌మెంట్ విధానం వచ్చినా లావుణి నిబంధనలు అమలుకాలేదంటూ కింది కోర్టు పేర్కొందని, గత ఉత్తర్వులను రద్దు చేస్తూ వచ్చిన నిబంధనలన్నది అర్థం చేసుకోవడంలో విఫలమైందన్నారు.

ప్రభుత్వ స్వాధీనంలోనే భూములు

భూములన్నీ 1961 నుంచి తమ పూర్వీకులు, తమ అధీనంలోనే ఉన్నాయన్న ప్రైవేటు వ్యక్తుల వాదనకు సరైన ఆధారాలు చూపడంలో విఫలమయ్యారని న్యాయమూర్తి పేర్కొన్నారు. 198889 నుంచి ప్రభుత్వ స్వాధీనంలోనే ఉన్నట్లు అధికారులు ఆధారాలు చూపారని, ప్రస్తుతం భూముల్లో చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌కు 6 ఎకరాలు, ఆర్టీఏకు 5 ఎకరాలు, ఏపీఎస్‌ఆర్టీసీకి 10 ఎకరాలు, జీర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు 5, బలహీనవర్గాల కాలనీకి 10, శ్మశానానికి 3 ఎకరాల కేటాయింపు జరిగిందని, ప్రస్తుతం 10.19 ఎకరాలు మిగిలిందని అధికారులు చెబుతున్నందున.. భూములు ప్రైవేటు వ్యక్తుల స్వాధీనంలో ఉన్నాయనడానికి ఆధారాల్లేవన్నారు. భూములన్నీ ప్రభుత్వానికే చెందుతాయంటూ కలెక్టర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ తీర్పు వెలువరించారు. ఇందులో 36 ఎకరాలకు కొనుగోలు ఒప్పందం చేసుకున్నామంటూ కాసాని జ్ఞానేశ్వర్, కుటుంబసభ్యులు, మరో రెండు ప్రైవేటు సంస్థలు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌లను న్యాయమూర్తి కొట్టివేశారు. సివిల్ కోర్టులో సూట్ వేసినపుడు కనీసం ఒప్పందం చేసుకున్నట్లు ఎక్కడా పిటిషనర్లు పేర్కొనలేదన్నారు.



మొదటి పేజీ తరువాయి

మొదటి పేజీ తరువాయి

# బెయిలు మంజూరీలో లొసుగులు.. జడ్జీలకు పునశ్చరణ దండన విధించిన సుప్రీం

ఈకబురు, దిల్లీ: దాదాపు రూ. 2 కోట్ల మేర మోసం చేసిన ఒక వివాహిత జంటకు లోపభూయిష్టమైన రీతిలో బెయిలు మంజూరు చేయడం ద్వారా చట్ట విరుద్ధంగా వ్యవహరించిన ఇద్దరు న్యాయాధికారులకు సుప్రీంకోర్టు అరుదైన దండన విధించింది. లోపాలతో కూడుకున్న ఆదేశాలు వెలువరించే తప్పిదానికి పాల్పడిన దిల్లీ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (ఏసీఎంఎం), సెషన్స్ జడ్జీలు వారం పాటు దిల్లీ జ్యుడీషియల్ అకాడమీలో పునశ్చరణ శిక్షణ తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ విషయంలో విచారణ అధికారులనూ సుప్రీంకోర్టు తప్పుపట్టింది. వారి వ్యవహార సరళిపై విచారణ జరపాల్సిందిగా దిల్లీ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. నిందితులకు ఏసీఎంఎం ఇచ్చిన బెయిలును రద్దు చేసింది. ఈ కేసు 2017లో శిక్షా రాథోడ్, ఆమె భర్త నెట్‌సిటీ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ నుంచి రూ 1.9 కోట్లు తీసుకొని అందుకు బదులుగా తమ భూమిని ఇస్తామని హామీ ఇచ్చారు.

నిందితులు సంస్థకు స్వాధీనపరుస్తామని హామీ ఇచ్చిన భూమి అప్పటికే మరొకరికి తనఖా పెట్టి ఉందని, ఆ భూమి తదనంతరం మరొకరికి విక్రయించేశారని దర్యాప్తులో తేలింది. ఇందుకు సంబంధించి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితులపై ప్రీత్ విహార్ పోలీస్ స్టేషన్‌లో 2018లో ఎఫ్‌ఐఆర్ దాఖలైంది. నిందితులకు దిల్లీ హైకోర్టు అందించిన మధ్యంతర రక్షణ నాలుగేళ్లు కొనసాగింది. ఫిర్యాదుదారుకు రూ 6.25 కోట్ల పరిహారం చెల్లిస్తామన్న నిందితులు మాట తప్పారు. ఇందుకు సంబంధించి నిందితులు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిలు దరఖాస్తును దిల్లీ హైకోర్టు 2023, ఫిబ్రవరి 1న తిరస్కరించింది. హైకోర్టు ముందస్తు బెయిలు నిరాకరించినా అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ నిందితులకు సాధారణ బెయిలు మంజూరు చేశారు. ఆ ఆదేశాలను సెషన్స్ జడ్జి సమర్థించారు. సాదాసీదా వాదన ఆధారంగా ఏసీఎంఎం బెయిలు మంజూరు చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. నిందితులు రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది.



# సీఎం రేవంత్‌ను కలిసిన క్రికెటర్ తిలక్‌వర్మ



ఈ-కబురు, హైదరాబాద్: ఆసియా కప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై అద్భుత ఇన్నింగ్స్‌తో అదరగొట్టిన భారత బ్యాటర్ తిలక్‌వర్మను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ఆసియా కప్‌లో భారత్ విజయంలో కీలకపాత్ర పోషించి హైదరాబాద్‌కు తిరిగొచ్చిన తిలక్ మంగళవారం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిలక్‌ను సీఎం సత్కరించి.. అభినందనలు తెలిపారు. రేవంత్‌రెడ్డికి తిలక్ క్రికెట్ బ్యాటును బహూకరించారు. "తిలక్‌వర్మ ప్రదర్శించిన క్రీడాస్ఫూర్తి ఎంతోమంది యువతకు ఆదర్శం. దేశం గర్వించే ప్రతిభావంతులైన క్రీడాకారులను తెలంగాణ గడ్డ ఎల్లప్పుడూ అందిస్తుంది" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనిబాల దేవి, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, తిలక్ కోచ్ సలాం తదితరులు పాల్గొన్నారు.

# పేదరికమే పెద్ద శత్రువు



**అందులో 10,786 మంది రైతులు..**
**1.73 లక్షల మందిని మింగిన రోడ్డు ప్రమాదాలు**
**చిన్నారులపై పెరిగిన దాష్టీకం**
**కిడ్నాప్‌ల పెరుగుదల**
**2023 ఏడాదిపై ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడి**

ఈకబురు, దిల్లీ: దేశంలో పేదరికమే శాపంగా మారింది. వారిని చుట్టుముట్టే ఆర్థిక సమస్యలు.. కుటుంబ కలహాలు, నిరుద్యోగం ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాయి. 2023 ఏడాదికి సంబంధించి జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) రూపొందించిన నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఆ ఏడాది ఆత్మహత్యలు చేసుకున్న 1,71,418 మందిలో 66.2 శాతం మంది (1,13,416) అల్పాదాయ వర్గాలవారే ఉన్నారు. వారి ఆదాయం రూ.లక్షలోపే ఉంది. ఆత్మహత్యలు చేసుకున్న వారిలో 28.3 శాతం మంది (48,432 మంది) ఆదాయం రూ.లక్ష నుంచి రూ.5లక్షల్లోపే ఉంది. దేశవ్యాప్తంగా 2023లో 10,786 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా.. రోడ్డు ప్రమాదాల్లో 1.73 లక్షల మంది అసువులు బాశారు. ఇందులో అతివేగం కారణంగా జరిగిన ప్రమాదాలే అధికం. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య అధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. మహిళలపై, చిన్నారులపై నేరాలు పెరగ్గా.. సీనియర్ సిటిజన్లపై తగ్గాయి.

ఆత్మహత్యల్లో..

2023లో 1,71,418 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 2022తో పోలిస్తే అవి 0.3 శాతం పెరిగాయి. పేదరికంలోనూ కుటుంబ సమస్యలు (31.9%), అనారోగ్యం (19%) ఆత్మహత్యలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

డ్రగ్స్, మద్యం వ్యసనాలు (7%), వివాహ సంబంధ సమస్యలు (5.3%), ప్రేమ వ్యవహారాలు (4.7%), అప్పులు (3.8%) వంటివీ కారణాలుగా ఉన్నాయి.

మహారాష్ట్రలో అత్యధికంగా 22,687 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తర్వాతి స్థానంలో 19,483తో తమిళనాడు ఉంది.

మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌లలోనే మొత్తం ఆత్మహత్యల్లో 49శాతం ఉన్నాయి. మిగిలిన 51 శాతం 23 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరిగాయి.

46,648 మంది మహిళలు ఆత్మహత్యలు చేసుకోగా వారిలో 51.6 శాతం మంది గృహిణులే ఉన్నారు. ఇందులోనూ వివాహ సంబంధ సమస్యలే అధికం.

ఆత్మహత్యలకు పాల్పడ్డ వారిలో 32.8 శాతం మంది 1830 ఏళ్ల మధ్య వయసు వారే ఉన్నారు. 32.8 శాతం మంది 3045 ఏళ్ల మధ్య వయసువారు. 18 ఏళ్లలోపు చిన్నారుల ఆత్మహత్యలకు కుటుంబ సమస్యలు, ప్రేమ వ్యవహారాలు, పరీక్షల ఫెయిల్ కావడం వంటివి కారణాలుగా ఉన్నాయి.

కేరళలో అత్యధికంగా నిరుద్యోగులు (2,191 మంది) ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

మొత్తం ఆత్మహత్యల్లో 42,238 మంది (24.6%) మెట్రిక్యులేషన్ వరకూ చదువుకున్నవారున్నారు.

రైతుల్లో..

వ్యవసాయ రంగంలో ఆత్మహత్యలు చేసుకున్న 10,786 మందిలో 4,690 మంది రైతులు, 6,096 మంది వ్యవసాయ కార్మికులున్నారు.

మొత్తం రైతుల్లో మహారాష్ట్ర నుంచే 38.5 శాతం మంది ఉన్నారు. తర్వాతి స్థానంలో కర్ణాటక (22.5%) ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచి 8.6 శాతం మంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో..

2023లో దేశవ్యాప్తంగా 4,64,029 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. 2022తో పోలిస్తే ఇవి 17,261 పెరిగాయి. 1,73,826 మంది మరణించారు. (2022లో 1,71,100 మరణాలు). 4,47,969 మంది గాయపడ్డారు.

మొత్తం మరణాల్లో 45.8 శాతం మంది (79,533 మంది) ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో మరణించారు. అతి వేగం, నిర్లక్ష్యం ఈ ప్రమాదాలకు కారణాలు.

95,984 ప్రమాదాలు (20.7%) సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య జరిగాయి. సాయంత్రం 3 నుంచి 6 గంటల మధ్య 80,482 ప్రమాదాలు (17.3%) చోటుచేసుకున్నాయి.

27,586 మంది పాదచారులు మృతి చెందారు.

సీనియర్ సిటిజన్లపై..

2023లో 27,886 మంది సీనియర్ సిటిజన్లపై దాడులు జరిగాయి. 2022లో 28,545 మందిపై జరిగాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడులలో ఈ నేరాలు అధికంగా జరుగుతున్నాయి.

1,914 మంది హత్య, 104 అత్యాచారాలు, 721 హత్యా ప్రయత్నాలు జరిగాయి.

జువైనల్ నేరాల్లో..

2023లో 31,365 మంది జువైనల్స్‌పై నేరాభియోగాలు నమోదయ్యాయి. 2022తో పోలిస్తే ఈ నేరాలు 2.7శాతం పెరిగాయి.

చిన్నారులపై..

చిన్నారులపై నేరాలు 2022తో పోలిస్తే 2023లో 9.2 శాతం పెరిగాయి. మొత్తం 1,77,335 నేరాలు జరిగాయి.

ప్రతి లక్ష మంది పిల్లల్లో 39.9 మంది హింసకు గురవుతున్నారు.

చిన్నారులపై నేరాల్లో కిడ్నాప్‌లు, అపహరణలు 79,884 (45%), లైంగిక దాడులు 67,694 (38,2%) ఉన్నాయి.

చిన్నారులపై నేరాల్లో మధ్యప్రదేశ్ తొలి స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్ ఉన్నాయి.

చిన్నారులపై నేరాల్లో ఛార్జిషీట్లు దాఖలవుతున్న రాష్ట్రాల్లో తమిళనాడు (93.7%), ఆంధ్రప్రదేశ్ (91.3%) మెరుగ్గా ఉన్నాయి.

కిడ్నాప్‌లు, అపహరణలు..

2023లో 1.16 లక్షల కిడ్నాప్, అపహరణల కేసులు నమోదయ్యాయి. ఇందులో 18,000 ఇష్టంగా వెళ్లిపోయినవి ఉన్నాయి.

1,13,564 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. 2022తో పోలిస్తే ఇవి 5.6 శాతం పెరిగాయి.

దిల్లీలో కిడ్నాప్‌లు అధికంగా జరుగుతున్నాయి.

కిడ్నాప్ కేసుల్లో వివాహం చేసుకుని వెళ్లిపోయిన 16,866 మంది మైనర్లు, 15,790 మంది మేజర్లున్నారు.

మహిళలపై..

2023లో మహిళలపై 4,48,211 దాడులు జరిగాయి. 2022తో (4,45,256) పోలిస్తే ఇవి స్వల్పంగా పెరిగాయి.

మహిళలపై నేరాల్లో ఛార్జిషీట్ల రేటు 77.6 శాతంగా ఉంది.

ఉత్తర్ ప్రదేశ్‌లో అత్యధికంగా మహిళలపై 66,381 నేరాలు చోటుచేసుకున్నాయి. తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర (47,101), రాజస్థాన్ (45,450), పశ్చిమ బెంగాల్ (34,691), మధ్యప్రదేశ్ (32,342) ఉన్నాయి.

ప్రతి లక్ష మందిలో 124.9 మంది మహిళలపై నేరాలతో తెలంగాణ తొలి స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో రాజస్థాన్ (114.8), ఒడిశా (112.4), హరియాణా (110.3), కేరళ (86.1) ఉన్నాయి.

భర్తలు, అతడి తరఫు బంధువులు పెట్టే హింసలపై అత్యధికంగా 1,33,676 కేసులు నమోదయ్యాయి.

కిడ్నాప్‌లు 88,605 జరిగాయి.

మహిళలపై దాడులు 83,891 జరిగాయి. అత్యాచారాలు 29,670 చోటుచేసుకున్నాయి.

వరకట్న మరణాలు 6,156 చోటుచేసుకున్నాయి.

రైలు ప్రమాదాల్లో..

2023లో జరిగిన రైలు ప్రమాదాల్లో 21,803 మంది మరణించారు. మొత్తం 24,678 ప్రమాదాలు జరిగాయి.

మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్‌లలో అత్యధికంగా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

56 శాతం రైలు ప్రమాదాలకు డ్రైవర్ల తప్పిదాలే కారణం. 43 శాతం ప్రమాదాలకు యాంత్రిక, పట్టాలు, వంతెనలు, టన్నెళ్లలో లోపాలు కారణమవుతున్నాయి.

# మళ్లీ ట్రంప్ టారిఫ్ బాంబు



ఈ-కబురు, వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశీ ఉత్పత్తులపై టారిఫ్‌ల మోత మోగిస్తూనే ఉన్నారు. ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా లెక్కచేయకుండా ముందుకెళ్తున్నారు. విదేశాల నుంచి దిగుమతి అయ్యే కలప(టింబర్)పై 10 శాతం, ఫర్నిచర్‌తోపాటు కిచెన్ కేబినెట్లపై 25 శాతం సుంకాలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఈ మేరకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సుంకాలు ఈ నెల 14వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ట్రంప్ ఆదేశాల పట్ల అమెరికాలో భవన నిర్మాణ రంగంపై మరింత భారం పడడం ఖాయమని నిపుణులు తేల్చిచెబుతున్నారు. ఇళ్ల నిర్మాణం ఖరీదైన వ్యవహారంగా మారుతుందని అంటున్నారు. అమెరికాలో నిర్మాణ వ్యయం ఇప్పటికే విపరీతంగా పెరిగిపోయింది.

స్థానిక పరిశ్రమల కోసమే

అమెరికా జాతీయ భద్రతను దృష్టిలో పెట్టుకోవడంతోపాటు స్థానిక కలప పరిశ్రమలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే విదేశీ కలప, ఫర్నిచర్‌పై సుంకాలు విధించినట్లు ట్రంప్ స్పష్టంచేశారు. స్థానిక పరిశ్రమలకు ఊతం ఇస్తే కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుందని, తద్వారా తమ యువతకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దిగుమతులు తగ్గించుకోవడంతోపాటు అమెరికా నుంచి కలప, ఫర్నిచర్ ఎగుమతులు పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. తమ అవసరాలకు సరిపోయే చెట్లు, కలప అమెరికాలో ఉన్నాయని స్పష్టంచేశారు. అమెరికాకు ప్రధానంగా పొరుగుదేశం కెనడా నుంచి కలప దిగుమతి అవుతుంది. ట్రంప్ తాజా నిర్ణయంతో కెనడాకు నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది.


# హామీల అమలులో

## కాంగ్రెస్ సర్కారు విఫలం




ఈ-కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో ఏ పల్లెకు వెళ్లినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయని, వాటిని మరమ్మతు చేయకుండా.. ఫ్యూచర్ సిటీకి ఆరు వరుసల రహదారి నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు మండిపడ్డారు. ఆరు గ్యారంటీలకు టాటా చెప్పిన సీఎం విలువైన భూములను విక్రయిస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 'కాంగ్రెస్ బాకీ కార్డు'ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలవుతున్నా కూడా ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్న విషయాన్నే బాకీ కార్డులో ఎండగడతామని తెలిపారు. భారాస నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ ఈ కార్డును అందజేసి కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను వివరించాలన్నారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామంటూ బిహార్ ప్రజలనూ రాహుల్‌గాంధీ మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి రైతుకు రూ.75 వేలు, ప్రతి మహిళకు రూ.44 వేలు బాకీ పడిందన్నారు. ఇప్పటికి 30 మంత్రివర్గ సమావేశాలు జరిగినా ఒరిగింది ఏమీలేదని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మండలానికో సమన్వయ కమిటీ వేసి, తదనుగుణంగా అభ్యర్థులను ఖరారు చేస్తామని చెప్పారు. సమావేశంలో భారాస నాయకులు రవీందర్‌రెడ్డి, గుండు భూపేశ్, వేణుగోపాల్‌రెడ్డి, పాల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# నిధుల వేటలో 4 కంపెనీలు




**ఆర్‌వీ ఇంజినీరింగ్, విరూపాక్ష ఆర్గానిక్స్ క్యాపిల్లరీ టెక్నాలజీస్‌కు సెబీ గ్రీన్ సిగ్నల్**

**సెబీకి ఏక్వస్ అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్ దాఖలు**

సెప్టెంబర్‌లో సందడే సందడిగా సాగిన ప్రైమరీ మార్కెట్లు ఈ నెల(అక్టోబర్)లోనూ మరింత దూకుడు చూపనున్నాయి. దిగ్గజాలు టాటా క్యాపిటల్, వియ్‌వర్క్ ఇండియా, ఎల్‌జీఎలక్ట్రానిక్స్ ఐపీవోలు ప్రారంభంకానుండగా.. మరో 4 కంపెనీలు నిధుల సమీకరణ బాట పట్టాయి. వివరాలు చూద్దాం..

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి 2 కంపెనీలు తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. జాబితాలో హైదరాబాద్ కంపెనీలు ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్, విరూపాక్ష ఆర్గానిక్స్ చేరాయి. మరోపక్క సాస్ సేవల కంపెనీ క్యాపిల్లరీ టెక్నాలజీస్ ఇండియా లిస్టింగ్‌కు సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ బాటలో గోప్యతా మార్గంలో దాఖలు చేసిన ప్రాస్పెక్టస్‌కు అప్‌డేటెడ్‌గా ఏక్వస్ మరోసారి సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది.

షేర్ల జారీ, ఆఫర్..

హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఇన్‌ఫ్రా కన్సల్టెన్సీ సేవల సంస్థ ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఐపీవోలో భాగంగా రూ. 202.5 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటితోపాటు మరో 67.5 లక్షల షేర్లను విక్రయించనుంది. ఐపీవో ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 76 కోట్లను రుణాల చెల్లింపునకు, దేశీ అనుబంధ సంస్థ ఎస్ఆర్ఏ ఓఎస్ఎస్‌లో రూ. 21.9 కోట్లు, విదేశీ అనుబంధ సంస్థలైన ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్‌లో రూ. 34.8 కోట్లు, బ్రిటన్ సంస్థ ఆర్‌వీ అసోసియేట్స్‌లో రూ. 20.8 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు కంపెనీ వినియోగించుకోనుంది. హై స్పీడ్ రైల్ ప్రాజెక్ట్, డెడికేటెడ్ ఫ్రైట్ రైల్ కారిడార్ మొదలైన ప్రాజెక్టులకు ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ సేవలు అందించింది.

ఫార్మా రంగ కంపెనీ

ఫార్మాస్యూటికల్ రంగ హైదరాబాద్ కంపెనీ విరూపాక్ష ఆర్గానిక్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 740 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. తద్వారా సమీకరించనున్న నిధులలో రూ. 360 కోట్లు సామర్థ్య విస్తరణపై వెచ్చించనుంది. మరో రూ. 195 కోట్లు రుణ చెల్లింపులకు, మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది.

ఆర్అండ్‌డీ ఆధారిత ఫార్మా కంపెనీ విరూపాక్ష ప్రధానంగా ఏఐపీలు, ఇంటర్‌మీడియేట్స్‌ను తయారు చేస్తోంది. 2025 మార్చి31కల్లా 54 ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. గతేడాది(2024-25) రూ. 811 కోట్ల ఆదాయం, రూ. 78 కోట్ల నికర లాభం ఆర్జించింది. హైదరాబాద్‌లో నాలుగు, కర్ణాటకలోని హమ్నాబాద్‌లో రెండు చొప్పున తయారీ యూనిట్లను కలిగి ఉంది. లారస్, న్యూలాండ్, దివీస్ ల్యాబ్స్, ఆర్తి డ్రగ్స్ తదితరాలను ప్రత్యర్థి సంస్థలుగా భావించవచ్చు.

సాస్ సేవలతో..

సాస్ సేవల కంపెనీ క్యాపిల్లరీ టెక్నాలజీస్ ఇండియా ఐపీవోకు సెబీ అనుమతించింది. జూన్‌లో దాఖలు చేసిన ప్రాస్పెక్టస్ ప్రకారం ఇష్యూలో భాగంగా రూ. 430 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.83 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 120 కోట్లు క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యయాలకు, రూ. 152 కోట్లు ప్రొడక్టులు, ప్లాట్‌ఫామ్ డెవలప్‌మెంట్‌కు వెచ్చించనుంది.

మిగిలిన నిధులను ఇతర సంస్థల కొనుగోళ్లకు వినియోగించనుంది. కంపెనీ గతంలో 2021 డిసెంబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసినప్పటికీ అనుమతి లభించకపోవడం గమనార్హం! కంపెనీ ఏఐ ఆధారిత క్లౌడ్‌లో భాగమైన సాఫ్ట్‌వేర్ ప్రొడక్టులు, సొల్యూషన్లు అందిస్తోంది. గతేడాది(2024-25) రూ. 598 కోట్ల ఆదాయం, రూ. 13 కోట్ల నికర లాభం ఆర్జించింది.

లిస్టింగ్‌కు ఏక్వస్ రెడీ

కన్జూమర్ ద్యురబుల్ గూడ్స్, ఏరోస్పేస్ పరికరాల కాంట్రాక్ట్ తయారీ కంపెనీ ఏక్వస్ సెబీకి తాజాగా అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. దీంతో ఐపీవో చేపట్టేందుకు వీలు చిక్కనుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 720 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 3.17 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు.

ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థలు ఏరోస్ట్రక్చర్స్ మాన్యుఫాక్చరింగ్ ఇండియా, ఏక్వస్ కన్జూమర్ ప్రొడక్ట్స్ రుణ చెల్లింపులకు, మెషీనరీ, ఎక్విప్‌మెంట్ కొనుగోలుకి వెచ్చించనుంది. అంతేకాకుండా ఇతర సంస్థల కొనుగోళ్లకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం నిధులను వినియోగించనుంది. కంపెనీ గోప్యతా మార్గంలో సెబీకి జూన్‌లో ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీంతో ఐపీవోకు వీలుగా మరోసారి అప్‌డేటెడ్ పత్రాలు అందించింది. కంపెనీలో అమికస్, అమన్సా, స్టెడ్‌వ్యూ క్యాపిటల్‌తోపాటు.. కాటమారన్, స్పర్శ గ్రూప్‌లు ఇన్వెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కంపెనీ క్లయింట్లలో బోయింగ్, బోయింగ్, బంబార్డియర్, జీకేఎన్ ఏరోస్పేస్, హనీవెల్, ఈటన్ తదితర దిగ్గజాలున్నాయి.

# 10 గ్రాములు రూ.1.20 లక్షలు



**బంగారం ధరలు వింటుంటే మధ్యతరగతి వర్గీయులకే కాదు సంపన్నులకూ చుక్కలు కనపడుతున్నాయి. హైదరాబాద్ బులియన్ విపణిలో 999 స్వచ్ఛత కలిగిన మేలిమి (24 క్యారెట్ల) బంగారం 100 గ్రాముల బిస్కెట్ ధర మంగళవారం రాత్రి రూ.12,00,000కు చేరింది. అంటే 10 గ్రాముల మేలిమి బంగారమే రూ.1.20 లక్షలు అన్నమాట. కిలో వెండి ధర కూడా రూ.1,47,500 వద్ద ఉంది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర 3845 డాలర్లకు మించడం, వెండి ఔన్సు ధర 46.52 డాలర్లకు చేరడం ఇందుకు కారణం. దేశీయంగా డాలర్ విలువ ఎన్నడూ లేని గరిష్ఠస్థాయి రూ.88.80కి చేరడం.. దేశీయంగా దిగుమతి సుంకం, జీఎస్‌టీ కలిపి 9 శాతానికి పైగా జతకలుస్తున్నందున ఈ లోహాల ధరలు అంతర్జాతీయ విపణితో పోలిస్తే, మనదగ్గర మరింత అధికంగా ఉంటున్నాయి. అమెరికాలో వడ్డీరేట్లను ఈ నెలలో తగ్గించడానికి తోడు, ఈ ఏడాదిలో మరిన్ని కోతలుంటాయనే దిశగా ఆ దేశ కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ సంకేతాలిచ్చింది. ఫలితంగా బాండ్లపై ప్రతిఫలాలు తగ్గుతున్నాయి. వర్ధమాన దేశాల్లో ఈక్విటీ మార్కెట్లు అంత ఆకర్షణీయంగా లేనందున పాశ్చాత్య మదుపర్లు తమ పెట్టుబడులను ఈ లోహాలపైకి మళ్లించడమే తాజా పరిస్థితికి కారణమని బులియన్ వర్గాలు వివరిస్తున్నాయి**

# వాట్సాప్‌కు పోటీగా స్వదేశీ యాప్: అరట్టై గురించి తెలుసా?.



స్మార్ట్‌ఫోన్ ఉపయోగించే ప్రతి ఒక్కరికీ.. వాట్సాప్ గురించి తెలిసే ఉంటుంది. కానీ ఇలాంటి తరహా ఇండియన్ యాప్ 'అరట్టై' (Arattai) గురించి తెలుసా?. ఈ పేరును ఎప్పుడైనా విన్నారా?. బహుశా ఈ పేరు కొత్తగా అనిపించినప్పటికీ.. ఈ యాప్ మొదటిసారిగా 2021లో యాప్ స్టోర్‌లలోకి ప్రవేశించింది. అయితే భారత ప్రభుత్వం ఆమోదం పొందిన తరువాత.. సోషల్ మీడియా వైరల్ అవ్వడంతో ఈ మేడ్ ఇన్ ఇండియా యాప్ ప్రస్తుతం ట్రెండింగ్ అవుతోంది.

అరట్టై యాప్ జోహో కంపెనీ రూపొందించింది. ప్రస్తుతం ఇది గూగుల్ ప్లే స్టోర్ & యాపిల్ యాప్ స్టోర్‌లలో అందుబాటులో ఉంది. దీనికి మెల్లగా ఆదరణ పెరుగుతోంది. దీన్నిబట్టి చూస్తే.. రానున్న రోజుల్లో మెటా మెసేజింగ్ యాప్ వాట్సాప్‌కు గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

అరట్టై.. వాట్సాప్ రెండూ మెసేజింగ్ యాప్స్ అయినప్పటికీ, అరట్టైలో కొన్ని అదనపు ఫీచర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ యాప్ గురించి జోహో సీఈఓ శ్రీధర్ వెంబు గత కొన్ని రోజులుగా తన ఎక్స్ ఖాతాలో చెబుతూనే ఉన్నారు.

అరట్టై ఆండ్రాయిడ్ టీవీలతో సహా విస్తృత శ్రేణి పరికరాలకు యాక్సెస్‌ను అందిస్తుంది. అయితే వాట్సాప్ ప్రస్తుతం వీటికి మద్దతు ఇవ్వదు. వినియోగదారులు తమ అరట్టై ఖాతాను ఒకేసారి ఐదు పరికరాల్లో ఉపయోగించవచ్చు.

అరట్టైలో పాకెట్ ఫీచర్ ఉంది. ఇది వినియోగదారులు ఫోటోలు, వీడియోలు, నోట్స్, రిమైండర్‌లు, ఇతర ఫైల్‌లను స్టోర్ చేసుకోవచ్చు. ప్రస్తుతం వాట్సాప్‌లో ఈ ఫీచర్ లేదు. అయితే, వాట్సాప్ 'యు' చాట్ విండోను అందిస్తుంది, ఇక్కడ వినియోగదారులు తమతో తాము చాట్ చేసుకోవచ్చు, కావలసినవి సేవ్ చేసుకోవచ్చు.

ఇదీ చదవండి: చాట్‌జీపీటీతో కొత్త భాష.. కేవలం 30 రోజుల్లో!

అరట్టై యాప్.. తక్కువ మెమరీ ఉన్న స్మార్ట్‌ఫోన్‌లు & పాత 2G/3G నెట్‌వర్క్‌లలో కూడా సజావుగా పనిచేసేలా రూపొందించబడింది. ఇది గ్రామీణ వినియోగదారులకు, బడ్జెట్ పరికరాలను కలిగిన వారికి అందుబాటులో ఉంటుంది. అంతే కాకుండా అరట్టైలో యూపీఐ చేయడానికి కూడా జోహో సిద్ధమవుతోంది. దీనికోసం ఐస్పిరిట్ గ్రూప్‌తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

# డ్రైవర్ అవసరం లేని ఆటో: ధర ఎంతో తెలుసా?



ఎలక్ట్రిక్ త్రీవీలర్ తయారీదారు ఒమేగా సీకి మొబిలిటీ (OSM).. భారతదేశంలో తన మొట్టమొదటి అటానమస్ ఎలక్ట్రిక్ ఆటోరిక్షాను లాంచ్ చేసింది. కంపెనీ దీనికి 'స్వయంగతి' అని పేరు పెట్టింది. ఇది ప్యాసింజర్ వెర్షన్, కార్గో వెర్షన్ అనే రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. వీటి ధరలు వరుసగా రూ.4 లక్షలు, రూ. 4.15 లక్షలు (ఎక్స్ షోరూమ్).

ఒమేగా సీకి మొబిలిటీ.. ఈ సరికొత్త అటానమస్ ఎలక్ట్రిక్ ఆటోరిక్షా కోసం బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించింది. డెలివరీలు వెంటనే ప్రారంభమవుతాయి. ఇది 10.3 కిలోవాట్ బ్యాటరీ ద్వారా 120 కిమీ రేంజ్ అందిస్తుంది. అయితే దీనికి కావలసిన ఛార్జింగ్ సదుపాయాల గురించి ఎలక్ట్రిక్ వాహన తయారీదారు ఇంకా ఎటువంటి సమాచారం అందించలేదు.

స్వయంగతి ఒమేగా సీకి.. ఏఐ స్వయంప్రతిపత్తి వ్యవస్థను పొందుతుంది. ఈ సెటప్‌లో లిడార్ టెక్నాలజీ, జీపీఎస్, ఆరు మీటర్ల వరకు అడ్డంకి గుర్తింపు, మల్టీ సెన్సార్ నావిగేషన్, రిమోట్ సేఫ్టీ ఫీచర్స్ ఉన్నాయి. ఇవన్నీ డ్రైవర్ అవసరం లేకుండానే.. ప్రీమ్యాప్ చేసిన మార్గాలను నావిగేట్ చేయడానికి వీలు కల్పిస్తాయి. కంపెనీ ఈ ఆటో రిక్షాను ఇప్పటికే టెస్ట్ చేసింది. రెండో దశలో కూడా టెస్ట్ చేయనున్నట్లు సమాచారం.

విమానాశ్రయాలు, టెక్ పార్కులు, గేటెడ్ కమ్యూనిటీలు, పారిశ్రామిక ప్రాంతాలు, స్మార్ట్ సిటీలలో ఈ ఎలక్ట్రిక్ రిక్షాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకునే కంపెనీ ఈ ఆటో రిక్షాను లాంచ్ చేసింది. ఒమేగా సీకి మొబిలిటీ రాబోయే రెండు సంవత్సరాలలో 1,500 అటానమస్ త్రీవీలర్లను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# ఎయిరిండియాఎయిర్‌బస్ పైలెట్ శిక్షణా కేంద్రం




పైలట్ల కోసం శిక్షణ కేంద్రాన్ని ఎయిరిండియా, ఎయిర్‌బస్ సంయుక్తంగా హరియాణాలో నెలకొల్పాయి. ఎయిర్‌బస్ ఏ320, ఏ350 విమానాల పైలెట్లకు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు. సిమ్యులేటర్ల కోసం ఈ సంస్థలు దాదాపు రూ.1000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ఎయిరిండియా ఏవియేషన్ ట్రైనింగ్ అకాడమీలో నెలకొల్పిన ఈ కేంద్రాన్ని పౌరవిమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మంగళవారం ప్రారంభించారు. 12000 చదరపు మీటర్లలో విస్తరించిన ఈ కేంద్రంలో 10 ఫుల్‌ఫ్లైట్ సిమ్యులేటర్లు ఉన్నాయి. అధునాతన తరగతి గదులు, బ్రీఫింగ్ గదులు కూడా ఇక్కడ ఏర్పాటు చేశారు. వచ్చే దశాబ్దకాలంలో ఈ అధునాతన పైలెట్ శిక్షణా కేంద్రం, 5000 మందికి పైగా కొత్త పైలెట్లకు శిక్షణ ఇవ్వనుందని ఎయిరిండియా తెలిపింది.

# 8 నెలలు.. 30000 సేల్స్: అమ్మకాల్లో క్లైలాక్ హవా!

**స్కోడా కంపెనీ ఇండియన్ మార్కెట్లో లాంచ్ చేసిన క్లైలాక్ కారు అమ్మకాల్లో సరికొత్త మైలురాయిని చేరుకుంది. కేవలం 8 నెలల్లో 30000 యూనిట్ల కంటే ఎక్కువ సేల్స్ సాధించింది. ఇది కంపెనీ సేల్స్ పెరగడానికి కూడా దోహదపడింది.**


**2025 జనవరిలో 1242 యూనిట్ల అమ్మకాలను సాధించిన స్కోడా క్లైలాక్.. ఆగస్టులో 3099 యూనిట్ల సేల్స్ పొందగలిగింది. ఇలా మొత్తం మీద ఈ కారు జనవరి నుంచి ఆగస్టు మధ్య కాలంలో 30190 అమ్మకాలు పొందింది. ఈ కారు ప్రారంభ ధర దేశీయ విఫణిలో రూ. 7.89 లక్షలు (ఎక్స్ షోరూమ్).**

**ఇదీ చదవండి: దేశంలో అత్యంత సరసమైన 5 బైకులు ఇవే!**

**స్కోడా క్లైలాక్ 1.10 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ ద్వారా 115 హార్స్ పవర్, 178 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తోంది. ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్ ఆప్షన్ పొందుతుంది. ఇది క్లాసిక్, సిగ్నేచర్, సిగ్నేచర్ ప్లస్ మరియు ప్రెస్టీజ్ అనే నాలుగు ప్రధాన వేరియంట్లలో ఏడు రంగు ఎంపికలలో అందుబాటులో ఉంది.**



## జ్ఞాపకాలను మోయడం ఆపేశాను



నా ఇరవయ్యేళ్ల వయసులో విశ్రాంతి లేకుండా గందరగోళంలో గడిపాను... గుర్తింపు కోసం ఆరాటపడ్డాను. నా ఫీలింగ్స్ ఏవీ పైకి కనిపించకుండా ఉండేందుకు కష్టపడ్డాను. ఈ క్రమంలో నన్ను నేను ఎంత కోల్పోయానో నాకు మాత్రమే తెలుసు. ఆ సమయంలో ప్రేమ గురించి నాకెవరూ చెప్పలేదు. కానీ నిజమైన ప్రేమ మనలోనే దాగి ఉంటుందని, మనల్ని మనం ప్రేమించుకోవడమే నిజమైన ప్రేమ అని ఆ తర్వాత అర్థం చేసుకున్నాను'' అని పేర్కొన్నారు సమంత.

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన ఆలోచనలను, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తన ఫ్యాన్స్‌తో షేర్ చేసుకుంటుంటారు సమంత. తన మేకప్‌మేన్‌తో ఓ సుదీర్ఘమైన చర్చ జరగిందని, ఈ చర్చలో ఎన్నో అంశాలను మాట్లాడుకున్నామని పేర్కొని, వాటిలోని కొన్ని అంశాలను ప్రస్తావిస్తూ, ఇన్‌స్టాలో ఓపోస్ట్ షేర్ చేశారు సమంత. ''ముప్పై ఏళ్ల తర్వాత మీరు ప్రపంచాన్ని చూసే తీరు మారిపోతుంది.

మీ అందంలో మార్పులొస్తాయి. ఇప్పుడు నేను ముప్పై ఏళ్లలో ఉన్నాను. ప్రతిదాని వెంట పరుగులు పెట్టడం ఆపేసి, జీవితాన్ని ఆస్వాదిస్తున్నాను. గతంలో నేను చేసిన తప్పుల తాలూకు జ్ఞాపకాలను మోయడం ఆపేశా. పబ్లిక్‌లో ఒకలా... ఒంటరిగా ఉన్నప్పుడు మరోలా... ఇలా రెండు రకాలుగా ఉండటం మానేశాను. ఎందుకంటే మీరు మీలా ఉన్నప్పుడే హ్యాపీగా... స్వేచ్ఛగా జీవించగలరు'' అని ఆపోస్ట్‌లో పేర్కొన్నారు సమంత.

## వయ్యారి.. తిప్పకు తిరిగే ఓ నారి!

తిరువీర్, టీనా శ్రావ్య జంటగా రాహుల్ శ్రీనివాస్ తెరకెక్కించిన చిత్రం 'ప్రీ వెడ్డింగ్ షో'. సందీప్ అగరం, అశ్మితా రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా నవంబరు 7న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. ''వయ్యారి వయ్యారి.. తిప్పుకు తిరిగే ఓ నారి'' అంటూ సాగిన ఈ పాటకు సురేశ్ బొబ్బిలి స్వరాలు సమకూర్చగా.. సనారే సాహిత్యమందించారు. యశ్వంత్ నాగ్, సిందుజ శ్రీనివాసన్ ఆలపించారు. ''ఇది ఓ వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్ చుట్టూ తిరిగే ప్రేమకథగా ఉంటుంది. అతనికి ఎదురైన ఓ వింత సమస్య.. దాని వల్ల పుట్టే వినోదం అందర్నీ ఆకట్టుకుంటాయి'' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి కూర్పు: నరేశ్ అడుప, ఛాయాగ్రహణం: కె సోమశేఖర్.



## కిల్లర్ కోసం వేట



పోలీసుల కంటే కూడా ఒక అడుగు ముందే ఉంటూ వ్యూహాల్ని మార్చే ఓ కిల్లర్ కోసం వేట ఎలా సాగింది? చివరికి ఎలా దొరికిపోయాడనేది తెలియాలంటే 'ఆర్యన్' చూడాల్సిందే. విష్ణు విశాల్ కథానాయకుడిగా తెరకెక్కిన ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ చిత్రమిది. సెల్వ రాఘవన్, శద్ధా శ్రీనాథ్, మానస చౌదరి ముఖ్య పాత్రలు పోషించారు. ప్రవీణ్.కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్‌తో కలిసి విష్ణు విశాల్ నిర్మించారు. ఈ నెల 31న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమా టీజర్ మంగళవారం విడుదలైంది. "బాధితుడి పేరుని ప్రకటించాకా గంటలోనే హత్య చేసే సీరియల్ కిల్లర్ లక్ష్యం ఏమిటి? అంత ప్రమాదకారి అయిన ఆ కిల్లర్ ఎవరో కనిపెట్టేందుకు ఓ యువ పోలీసు అధికారి చేసిన పరిశోధన ఎలా సాగిందనే విషయాలు సినిమాకి హైలెట్‌గా నిలుస్తాయ'ని సినీ వర్గాలు తెలిపా

## 'మహాకాళి'లో శుక్రాచార్యుడు



హనుమాన్' విజయం దర్శకుడు ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌కు కొత్త జోష్‌ను అందించింది. ఈ జోరులోనే ఇప్పుడీ యూనివర్స్‌లో నుంచి రానున్న తొలి ఫీమేల్ సూపర్ హీరో చిత్రం 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా ఇందులో శుక్రాచార్యుడి పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ విషయాన్ని చిత్ర బృందం మంగళవారం అధికారికంగా ప్రకటిస్తూ.. ఆయన పాత్ర ఫస్ట్‌లుక్‌ను నెట్టింట పంచుకుంది.

# పవన్ 'ఓజీ'తో సరైన విందు అందించాడు




''హాలీవుడ్ ప్రమాణాలకు తగినట్లు అద్భుతంగా నిర్మించిన అండర్ వరల్డ్ గ్యాంగ్‌స్టర్ చిత్రం 'ఓజీ'' అని కథానాయకుడు చిరంజీవి అన్నారు. ఈ సినిమాని పవన్ కల్యాణ్ తనదైన స్వాగ్‌తో ప్రత్యేకంగా నిలబెట్టారని.. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న అభిమానులకు ఈ చిత్రంతో సరైన విందు అందించాడని ప్రశంసించారు. పవన్ కల్యాణ్ టైటిల్ పాత్రలో నటించిన ఈ 'ఓజీ'ని సుజీత్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ప్రియాంక మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ, ప్రకాశ్‌రాజ్, శ్రియా రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో చిరంజీవి కుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని వీక్షించారు. దీనికి సంబంధించి కుటుంబంతో పాటు చిత్ర యూనిట్‌తో కలిసి దిగిన ఫొటోల్ని సామాజిక మాధ్యమాల వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ''ఓజీ'లోని ప్రతి అంశాన్ని పూర్తిగా ఆస్వాదించాను. ప్రారంభం నుంచి ముగింపు వరకు ఈ సినిమాని భావోద్వేగాలకు లోటు లేకుండా దర్శకుడు సుజీత్ అసాధారణ రీతిలో రూపొందించారు. పవన్ కల్యాణ్‌ను తెరపై ఇలా చూడటం చాలా గర్వంగా అనిపించింది'' అంటూ చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ''ఓజీ' చిత్రాన్ని అద్భుతంగా మలచడంలో దర్శకుడు సుజీత్, సంగీత దర్శకుడు తమన్‌తో పాటు చిత్ర బృందమంతా గొప్పగా పని చేసింద''ని పవన్ కల్యాణ్ అభినందించారు. 'ఓజీ' యూనివర్స్ కోసం తానూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు తెలిపారు.

**'కొదమసింహం' మరోసారి!**

చిరంజీవి కథానాయకుడిగా నటించిన 'కొదమసింహం' రీరిలీజ్‌కి సిద్ధమైంది. ఈ చిత్రాన్ని 4కే విజువల్స్‌తో, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా ముస్తాబు చేసి ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు చిత్ర నిర్మాత, రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. చిరంజీవి నటించిన ఒకే ఒక్క కౌబాయ్ సినిమా ఇది. మోహన్‌బాబు కీలక పాత్ర పోషించారు. రాధ, సోనం, వాణీ విశ్వనాథ్ కథా నాయికలు. కె.మురళీమోహన్‌రావు దర్శకత్వం వహించారు. 1990, ఆగస్టు 9న విడుదలైంది. అప్పట్లో ఎంతో ఆదరణ పొందిన ఈ చిత్రం, మరోసారి ప్రేక్షకులకు వినోదం పంచుతుందని నిర్మాత అన్నారు. ఈ చిత్రానికి రాజ్‌కోటి స్వరాలు సమకూర్చారు.

## 'బాహుబలి'ని అప్పుడు ఆస్వాదించలేకపోయినా..!



అనుష్క సినీ ప్రయాణంలో 'బాహుబలి' చిత్రాలకు ప్రత్యేక స్థానముంది. అయితే తనకు జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు తెచ్చిపెట్టిన ఆ సినిమాల్ని అప్పట్లో తాను మనస్ఫూర్తిగా ఆస్వాదించలేకపోయానని చెప్పింది స్వీటీ. ఇప్పుడీ రెండు సినిమాలు 'బాహుబలి ది ఎపిక్' పేరుతో ఒకే భాగంగా అక్టోబరు 31న తెరపైకి రానుండటం తనకెంతో ఆనందాన్నిస్తోందని తెలిపింది. "బాహుబలి' సినిమాలు విడుదలైనప్పుడు ప్రచార కార్యక్రమాలు.. ఇతర కారణాల వల్ల వాటిని మనస్ఫూర్తిగా ఆస్వాదించే తీరిక మాకు దొరకలేదు. ఇప్పుడివి ఒకే భాగంగా మళ్లీ థియేటర్లలోకి రానుండటం నాకెంతో సంతోషాన్నిచ్చింది. ఈసారి దీన్ని ఆద్యంతం తనివితీరా ఎంజాయ్ చేయాలనుకుంటున్నా. కొన్ని నెలల క్రితం నిర్మాత శోభు నాకు 'బాహుబలి ది ఎపిక్' గురించి చెప్పారు. ఈ ఆలోచన ఆసక్తికరంగా అనిపించింది. ప్రస్తుతం దీనికి సంబంధించి తెర వెనుక చాలా వర్క్ జరుగుతోంది. కచ్చితంగా ఇది అందరికీ మళ్లీ ఓ కొత్త సినిమా చూసిన అనుభూతిని అందిస్తుంది" అని అనుష్క చెప్పుకొచ్చింది.

## ఇక్కడ 'ఓజీ'లో ఇది అదనం.. ఎంతో ప్రత్యేకం!

పవన్ కల్యాణ్ నటించిన గ్యాంగ్‌స్టర్ డ్రామా మూవీ 'ఓజీ'లో ప్రత్యేక గీతాన్ని (OG Special Song) తాజాగా యాడ్ చేశారు. 'కిస్ కిస్ బ్యాంగ్ బ్యాంగ్' (Kiss Kiss Bang Bang) పాటను మంగళవారం రాత్రి షో నుంచి అటాచ్ చేస్తున్నట్టు నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రకటించింది. హీరోయిన్ నేహాశెట్టి (Neha Shetty) ఈ స్పెషల్ సాంగ్‌లో నటించింది.

సినిమా విడుదలకు ముందు ఈ పాట వివరాలను చిత్ర బృందం అధికారికంగా ప్రకటించనప్పటికీ.. రూమర్స్ రావడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అనివార్య కారణాల వల్ల సినిమా నుంచి ఈ పాటను తొలగించిన చిత్ర బృందం.. ఆ సర్‌ప్రైజ్‌ను ఇప్పుడు ఇచ్చింది. సుజీత్ తెరకెక్కించిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా రూ.154 కోట్లకుపైగా వసూలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 25న విడుదలైన ఈ సినిమా నాలుగు రోజుల్లోనే రూ.252 కోట్లకుపైగా కలెక్షన్స్ రాబట్టినట్టు టీమ్ మంగళవారం వెల్లడించింది. బుధవారం సాయంత్రం చిత్ర విజయోత్సవాన్ని నిర్వహించనున్నట్టు తాజాగా తెలిపింది. వేదిక వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఈ ఈవెంట్‌కు పవన్ కూడా హాజరుకానున్నారని సమాచారం.



# తొలి మ్యాచ్‌లో లంకపై ఘనవిజయం




**అదరగొట్టిన దీప్తి, అమన్‌జ్యోత్**
**ప్రపంచకప్‌లో భారత్ శుభారంభం**

**సొంతగడ్డపై మహిళల వన్డే ప్రపంచకప్.. ఈసారి బలమైన జట్టుతో బరిలోకి భారత్.. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ లాంటి మేటి జట్లను సైతం ఓడించగలదని, కప్పు గెలవగలదని హర్మన్‌ప్రీత్ సేనపై అంచనాలు! కానీ శ్రీలంక లాంటి బలహీన జట్టుతో ఆరంభ పోరులో కేవలం 4 పరుగుల తేడాలో 4 వికెట్లు కోల్పోయి 124/6తో నిలిచిన క్షణాన ఆశలు, అంచనాలు ఒక్కసారిగా కూలిపోతున్న భావన! లంకతోనే ఇలా ఆడితే, ఓడితే.. ఇక కప్పేం గెలుస్తారనే నిట్టూర్పులు! కానీ ప్రతికూల పరిస్థితుల్లో గొప్ప పట్టుదలతో నిలిచిన దీప్తి శర్మ, అమన్‌జ్యోత్.. మొత్తం కథను మార్చేశారు. జట్టుకు మెరుగైన స్కోరునందించారు. ఆపై బౌలింగ్‌లోనూ దీప్తి జట్టును ముందుండి నడిపించింది. మిగతా బౌలర్లూ సత్తా చాటారు. ఫలితం.. తొలి పోరులో భారత్‌కు 60 పరుగుల విజయం.**

మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఫేవరెట్లలో ఒకటైన భారత జట్టు.. టోర్నీని ఘనవిజయంతో ఆరంభించింది. మంగళవారం తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పటికీ తట్టుకుని నిలబడ్డ భారత్.. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 60 పరుగుల తేడాతో శ్రీలంకను ఓడించింది. వర్షం వల్ల 47 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో మొదట అమన్‌జ్యోత్ కౌర్ (57; 56 బంతుల్లో 5×4, 1×6), దీప్తి శర్మ (53; 53 బంతుల్లో 3×4), హర్లీన్ డియోల్ (48; 64 బంతుల్లో 6×4) రాణించడంతో భారత్ 8 వికెట్లకు 269 పరుగులు సాధించింది. లక్ష్యాన్ని 271 పరుగులకు సవరించగా.. లంక 45.4 ఓవర్లలో 211 పరుగులకే కుప్పకూలింది. చమరి ఆటపట్టు (43), నీలాక్షిక (35), హర్షిత (29) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. దీప్తి (3/54), స్నేహ్ రాణా (2/32) బౌలింగ్‌లోనూ అదరగొట్టారు. తెలుగమ్మాయి శ్రీచరణి (2/37) కూడా సత్తా చాటింది. దీప్తి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. భారత్ ఆదివారం పాకిస్థాన్‌తో తన తర్వాతి మ్యాచ్ ఆడుతుంది. ఈ మ్యాచ్ కోసం హర్మన్‌ప్రీత్ సేన కొలంబోకు వెళ్తుంది.

మళ్లీ దీప్తినే..: ఛేదనను లంక ఆరంభించిన తీరు చూస్తే.. భారత్‌కు ఓటమి తప్పదా అనిపించింది. భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న కెప్టెన్ చమరి జట్టును ముందుండి నడిపించింది. మరో ఓపెనర్ హాసిని (14) ఎక్కువసేపు నిలవకపోయినా.. హర్షిత (29) ఆమెకు చక్కగా సహకరించింది. దీంతో 82/1తో లంక పటిష్ట స్థితికి చేరుకుంది. అయితే స్పిన్నర్ల రాకతో ఆ జట్టుకు ఇబ్బంది తప్పలేదు. బ్యాటింగ్‌లో లంకకు ఎదురు నిలిచిన దీప్తి.. బౌలింగ్‌లోనూ ప్రత్యర్థి జట్టును దెబ్బకొట్టింది. చమరిని బౌల్డ్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పింది. మరోవైపు శ్రీచరణి.. హర్షితను ఔట్ చేయడంతో లంక నిలవలేకపోయింది. మధ్య ఓవర్లలో స్నేహ్ సైతం విజృంభించింది. విష్మి (11), దిల్హరి (15), సంజీవని (6) స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. నీలాక్షిక పోరాటం ఓటమి అంతరం తగ్గించడానికే ఉపయోగపడింది.

షాక్ మీద షాక్: మొదట టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే పెద్ద షాక్ తగిలింది. ఇన్నింగ్స్ నెమ్మదిగా ఆరంభం కాగా.. సూపర్ ఫామ్‌లో ఉన్న స్మృతి మంధాన (8) నాలుగో ఓవర్లోనే (ప్రబోధిని) ఔటైపోయింది. షాట్ ఆడబోయిన ఆమె డీప్ పాయింట్‌లో ఫీల్డర్‌కు దొరికిపోయింది. అయితే ఈ ఎదురుదెబ్బ నుంచి భారత్ బాగానే కోలుకుంది. మరో ఓపెనర్ ప్రతీక రావల్ (37; 59 బంతుల్లో 3×4, 1×6), హర్లీన్ డియోల్ నిలకడగా ఆడి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. కుదురుకోవడానికి సమయం తీసుకున్న ఈ ఇద్దరూ తర్వాత చక్కటి షాట్లు ఆడారు. 19 ఓవర్లకు 81/1తో భారత్ మెరుగైన స్థితికి చేరుకుంది. కానీ మంచి లయలో ఉన్న ప్రతీకను ఇనోక ఔట్ చేయడంతో రెండో వికెట్ భాగస్వామ్యానికి 67 పరుగుల వద్ద తెరపడింది.

తర్వాత హర్లీన్.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (21)తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. హర్లీన్ అర్ధశతకం దిశగా సాగగా.. హర్మన్ క్రీజులో బాగా కుదురుకోవడంతో భారత్ 25 ఓవర్లకు 129/2తో నిలిచింది. ఈ దశలో భారత్‌కు మామూలు షాక్‌లు తగల్లేదు. ఇనోక ఒకే ఓవర్లో మూడు వికెట్లతో విజృంభించింది. ముందుగా హర్లీన్‌ను క్యాచౌట్‌తో పెవిలియన్ చేర్చిన ఇనోక.. వెంటనే జెమీమాను క్లీన్‌బౌల్డ్ చేసింది. అవతలి ఎండ్ నుంచి ఈ వికెట్లను చూసి అసంతృప్తి వ్యక్తం చేసిన హర్మన్.. అదే ఓవర్లో స్ట్రైకింగ్‌కు వచ్చి వికెట్ కీపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరింది. లంక కెప్టెన్ చమరి వేసిన తర్వాతి ఓవర్లో హిట్టర్ రిచా ఘోష్ (2) కూడా ఔటైపోవడంతో 124/6తో భారత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో స్కోరు 200 చేరడం కూడా కష్టమే అనిపించింది. కానీ దీప్తి తన అనుభవాన్నంతా ఉపయోగించి వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేసింది.

అమన్‌జ్యోత్ నుంచి ఆమెకు చక్కటి సహకారం అందింది. దీప్తి నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను నిర్మిస్తే.. అమన్‌జ్యోత్ ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ జోడీ ఏడో వికెట్‌కు 103 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. అర్ధశతకం తర్వాత అమన్‌జ్యోత్ ఔటైనా.. దీప్తి అండతో స్నేహ్ రాణా (28 నాటౌట్; 15 బంతుల్లో 2×4, 2×6) ఆఖర్లో చెలరేగడంతో భారత్ అనుకున్న దాని కంటే మెరుగైన స్కోరే చేసింది. లంక పేలవ ఫీల్డింగ్ భారత్‌కు బాగా కలిసొచ్చింది. అయిదు క్యాచ్‌ల దాకా నేలపాలయ్యాయి. అనంతరం ఇండియా ఫీల్డింగ్ కూడా ఏమంత గొప్పగా సాగలేదు.

భారత్ ఇన్నింగ్స్: ప్రతీక రావల్ (సి) విష్మి (బి) ఇనోక 37; స్మృతి (సి) విష్మి (బి) ప్రబోధిని 8; హర్లీన్ (సి) దిల్హరి (బి) ఇనోక 48; హర్మన్‌ప్రీత్ (సి) సంజీవని (బి) ఇనోక 21; జెమీమా (బి) ఇనోక 0; దీప్తి (సి) కుమారి (బి) అచిని 53; రిచా ఘోష్ (సి) ప్రబోధిని (బి) చమరి 2; అమన్‌జ్యోత్ (సి) విష్మి (బి) ప్రబోధిని 57; స్నేహ్ రాణా నాటౌట్ 28; ఎక్స్‌ట్రాలు 15 మొత్తం: (47 ఓవర్లలో 8 వికెట్లకు) 269; వికెట్ల పతనం: 114, 281, 3120, 4120, 5121, 6124, 7227, 8269; బౌలింగ్: అచిని 80421; ప్రబోధిని 101552; కుమారి 90460; కవిష దిల్హరి 80510; ఇనోక 90464; చమరి 30241

శ్రీలంక ఇన్నింగ్స్: హాసిని (బి) క్రాంతి 14; చమరి (బి) దీప్తి 43; హర్షిత ఎల్బీ (బి) శ్రీచరణి 29; విష్మి ఎల్బీ (బి) అమన్‌జ్యోత్ 11; దిల్హరి (సి) రిచా (బి) దీప్తి 15; నీలాక్షిక (బి) స్నేహ్ 35; సంజీవని (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 6; కుమారి (బి) స్నేహ్ 10; అచిని (సి) స్మృతి (బి) శ్రీ చరణి 17; ప్రబోధిని నాటౌట్ 14; ఇనోక ఎల్బీ (బి) ప్రతీక 3; ఎక్స్‌ట్రాలు 14 మొత్తం: (45.4 ఓవర్లలో ఆలౌట్) 211; వికెట్ల పతనం: 130, 282, 3103, 4105, 5130, 6140, 7173, 8184, 9199; బౌలింగ్: క్రాంతి గౌడ్ 90411; అమన్‌జ్యోత్ 60371; స్నేహ్ రాణా 100322; దీప్తి శర్మ 101543; శ్రీ చరణి 80372; ప్రతీక 2.4061

వన్డేల్లో దీప్తి వికెట్లు ఈ ఫార్మాట్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్లలో రెండో స్థానానికి చేరుకుంది. ఝులన్ (255)ది అగ్రస్థానం.

జుబీన్‌ను తలుచుకుంటూ..

బాణసంచా వెలుగులు.. శ్రేయా ఘోషల్ పాటలతో మహిళల వన్డే ప్రపంచకప్ మంగళవారం ఘనంగా ఆరంభమైంది. ఈ కప్ థీమ్ సాంగ్ 'బ్రింగ్ ఇట్ హోమ్'తో గువాహటి స్టేడియం మార్మోగింది. ఈ సందర్భంగా ఇటీవలే మరణించిన ప్రముఖ అసోం గాయకుడు జుబీన్ గార్గ్‌కు స్మృతిగా 13 నిమిషాల ప్రత్యేక కార్యక్రమం జరిగింది. జుబీన్ పాడిన పాటలను శ్రేయా ఘోషల్ ఆలపించారు. ఆయన అభిమానుల కోసం అసోం క్రికెట్ సంఘం 5 వేల టికెట్లు ఉచితంగా ఇచ్చింది. ఇటీవల సింగపూర్‌లో ఒక సముద్ర ప్రమాదంలో జుబీన్ మరణించారు. ఆరంభ వేడుకల్లో మిథాలిరాజ్ సహా మాజీ కెప్టెన్లు పలువురు పాల్గొన్నారు. స్టేడియంలో చాలామంది అభిమానులు హర్మన్‌ప్రీత్ కౌర్, మిథాలిరాజ్ జెర్సీలతో కనిపించారు.

**ఆస్ట్రేలియా × న్యూజిలాండ్**
**వేదిక: ఇండోర్, మధ్యాహ్నం 3 నుంచి**

# జావెలిన్‌లో డబుల్ ధమాకా

**సుమిత్, సంజయ్‌లకు స్వర్ణాలు**
**ప్రపంచ పారా అథ్లెటిక్స్**

దిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు అదరగొట్టారు. ఒకేరోజు రెండు స్వర్ణాలు సహా నాలుగు పతకాలు ఖాతాలో చేర్చారు. మంగళవారం జావెలిన్‌త్రోలోనే రెండు పసిడి పతకాలు సొంతమయ్యాయి. పురుషుల ఎఫ్64 విభాగంలో సుమిత్ అంటిల్ జావెలిన్‌ను 71.37 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో తానే సృష్టించిన ఛాంపియన్‌షిప్ రికార్డు (70.83 మీ, 2023లో)ను తుడిచిపెట్టాడు. ఈ టోర్నీలో పసిడి హ్యాట్రిక్ కూడా కొట్టాడు. 2023, 24లోనూ అతడు స్వర్ణాన్ని నెగ్గాడు. పురుషుల ఎఫ్44 జావెలిన్ త్రోలో సందీప్ సంజయ్ సర్గార్ స్వర్ణం.. సందీప్ చౌదరి రజతంతో మెరిశారు. సంజయ్ 62.82 మీటర్ల త్రో వేయగా.. సందీప్ 62.67 మీటర్లు జావెలిన్ విసిరాడు. ఎడినిల్‌సన్ (బ్రెజిల్, 62.36 మీ) కాంస్యం దక్కించుకున్నాడు.

యోగేశ్ మూడోసారి: డిస్కస్ త్రోలో యోగేశ్ కతూనియా హ్యాట్రిక్ రజతం కైవసం చేసుకున్నాడు. ఎఫ్56 కేటగిరిలో 42.49 మీటర్ల దూరం డిస్క్‌ను విసిరి రెండో స్థానంలో నిలిచాడు. క్లాడినీ బటిస్టా (బ్రెజిల్, 45.67 మీటర్లు) స్వర్ణం, కొన్‌స్టాన్‌టినోస్ (గ్రీస్, 39.97 మీటర్లు) కాంస్యం గెలిచారు. టీ44 100 మీటర్ల పరుగులో నైఫ్ అల్మాస్‌రహి (సౌదీ అరేబియా) ప్రపంచ రికార్డు సృష్టిస్తూ పసిడి గెలిచాడు. 10.94 సెకన్లలో లక్ష్యాన్ని చేరిన అతడు 2019లో ఎంలాంగో (దక్షిణాఫ్రికా, 11 సె) నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టాడు. టీ34 200 మీటర్లలో డేవిడ్ (రష్యా), టీ20 400 మీటర్లలో డేవిడ్ జోస్ (స్పెయిన్), టీ54, 400 మీటర్లలో యాసిన్ (ట్యూనీసియా) పసిడి గెలిచారు.

## ప్రమాదంలో కాలు కోల్పోయి..




ప్రపంచ పారా ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణాల హ్యాట్రిక్ సాధించిన సుమిత్ అంటిల్ మొదట రెజ్లర్ కావాలనుకున్నాడు. కానీ విధి అతడి ప్రణాళికలను మార్చేసింది. హరియాణాకు చెందిన ఈ కుర్రాడు 17 ఏళ్ల వయసులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతడు ప్రయాణిస్తున్న బైక్.. ట్రక్‌ను ఢీకొనడంతో ఎడమ కాలిని కోల్పోయాడు. దీంతో రెజ్లర్ కావాలనే కల చెదిరింది. కానీ క్రీడలపై ఆసక్తిని కోల్పోలేదు. 2017లో పారా అథ్లెట్‌గా మారాడు. జావెలిన్ త్రోలో పట్టు సాధించి ఈ క్రీడలో దూసుకెళ్తున్నాడు. 2020, 2024 పారాలింపిక్స్‌లో స్వర్ణాలు నెగ్గిన 27 ఏళ్ల సుమిత్.. ప్రపంచ అథ్లెటిక్స్‌లో ఇప్పటివరకు మూడు స్వర్ణాలతో సహా నాలుగు పతకాలు కైవసం చేసుకున్నాడు .

## నాలుగేళ్ల వయసులోనే..




మహారాష్ట్రకు చెందిన సందీప్ సంజయ్ నేపథ్యం భిన్నం. నాలుగేళ్ల వయసులోనే ఒక ప్రమాదంలో అతడి కాలికి తీవ్ర గాయం అయ్యింది. ఆటపై ఆసక్తితో అతడు పారా జావెలిన్‌వైపు అడుగులేశాడు. ఆర్థికంగా అవరోధాలు ఎదురైనా.. సాధన మానలేదు. ఒకవైపు పుణెలో డెలివరీ బాయ్‌గా పని చేస్తూనే శిక్షణ సాగించిన అతడు.. తొందరగానే ఆటపై పట్టు సంపాదించాడు. అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్నాడు. 2022లో ప్రపంచ పారా గ్రాండ్‌ప్రిలో పసిడి నెగ్గాడు. 2024 షార్జాలో జరిగిన ప్రపంచ పారా గ్రాండ్‌ప్రిలోనూ స్వర్ణంతో మెరిశాడు. ఇప్పుడు ప్రపంచ అథ్లెటిక్స్‌లో తొలిసారి బరిలో దిగి పసిడితో సత్తా చాటాడు.

# విజయంతో బదులిచ్చాం



హైదరాబాద్: ఆసియా కప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై ఆడిన ఇన్నింగ్సే తన కెరీర్ ఫేవరెట్ అని భారత స్టార్ బ్యాటర్ తిలక్‌వర్మ అన్నాడు. తీవ్ర ఒత్తిడిలోనూ పాక్ ఆటగాళ్ల మాటల దాడిని ఎదుర్కొంటూ భారత్‌ను విజేతగా నిలిపినట్లు తిలక్ తెలిపాడు. ఆసియా కప్ ఫైనల్లో అద్భుత బ్యాటింగ్‌తో ఇమ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచి స్వదేశానికి తిరిగొచ్చిన తిలక్.. మంగళవారం హైదరాబాద్ లింగంపల్లిలోని లేగాల అకాడమీని సందర్శించాడు. తాను ఓనమాలు నేర్చుకున్న అకాడమీలో చిన్నారులు, అభిమానులతో కరచాలనాలతో సందడి చేశాడు. ఈ సందర్భంగా తిలక్ విలేకరులతో మాట్లాడాడు.

''పాకిస్థాన్‌తో ఫైనల్లో భారత్ ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయింది. మేం కాస్త ఒత్తిడికి లోనయ్యాం. ఇదే అదనుగా పాక్ ఆటగాళ్లు మాటల దాడి పెంచారు. మైదానంలో జరిగిన సంభాషణలు ఇక్కడ చెప్పడం సమంజసం కాదు. అప్పటికప్పుడు వాళ్లకు బదులిచ్చాం. కానీ అసలైన సమాధానం మ్యాచ్ అయ్యాక విజయంతో ఇచ్చాం. మ్యాచ్‌ల్లో మాటల దాడి సహజం. బ్యాటర్లు, బౌలర్లకు మధ్య వాదనలు నడుస్తూనే ఉంటాయి. భారత్, పాక్ మ్యాచ్‌లో తీవ్రత ఇంకాస్త ఎక్కువ ఉంటుంది. ఆ సమయంలో ఆవేశానికి గురవలేదు. ఏకాగ్రత కోల్పోతే దేశాన్ని, 140 కోట్ల మంది భారతీయుల నమ్మకాన్ని వమ్ము చేసినట్లు అవుతుంది. అప్పుడు ఏది అవసరమో అదే పని చేశా.

దేశం కోసం ప్రాణం ఇవ్వడానికైనా సిద్ధమే కానీ ఓడిపోవద్దని అనుకున్నా. దేశమే అన్నిటికంటే గొప్ప. అందుకే సంయమనం పాటించా. ఏకాగ్రతతో బ్యాటింగ్ చేశా. ఒక్కో బంతిని జాగ్రత్తగా ఎదుర్కొన్నా. భారత్ మ్యాచ్ గెలవడమే మాకు ముఖ్యం. అనవసరంగా ఆవేశానికి గురై.. ఏదైనా చెత్త షాట్ ఆడితే వికెట్ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. చెన్నైలో ఇంగ్లాండ్‌పై కూడా మంచి ఇన్నింగ్స్ ఆడా. కానీ ఆసియా కప్ ఫైనల్లో పాక్‌పై ఆడిన ఇన్నింగ్సే నా ఫేవరెట్. చిన్నప్పటి నుంచి లేగాల అకాడమీలోనే సాధన చేశా. తిలక్ ఎవరో తెలియనప్పుడు నా వెనకాల కోచ్‌లే ఉన్నారు. కోహ్లి, సచిన్‌ల మాదిరే కోచ్‌లకు గౌరవ, మర్యాదలు ఇస్తా. నేను ఏ స్థాయికి వెళ్లినా వాళ్లను గుర్తుంచుకుంటా. ఫామ్‌లో లేనప్పుడు ఇక్కడికి వస్తే ఈ మట్టి నాకు ఆత్మవిశ్వాసం అందిస్తుంది. నన్ను తీర్చిదిద్దిన కోచ్ సలాంకు ఎప్పటికీ రుణపడి ఉంటా. నా విజయానికి తల్లిదండ్రులు, కోచ్‌లే కారణం'' అని తిలక్ వివరించాడు.

# నఖ్వీ తీరుపై బీసీసీఐ తీవ్ర అభ్యంతరం




దుబాయ్: ఆసియా కప్‌లో భారత జట్టుకు ట్రోఫీ ప్రదానం చేయకపోవడం పట్ల బీసీసీఐ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. మంగళవారం ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ఏజీఎంలో బీసీసీఐ తన నిరసనను తెలియజేసింది. పాకిస్థాన్ మంత్రి, ఏసీసీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ నుంచి ట్రోఫీ తీసుకునేందుకు భారత్ నిరాకరించడంతో అతను తనతో పాటు కప్‌ను తీసుకెళ్లాడు. ప్రస్తుతం ఆసియా కప్ ట్రోఫీ ఏసీసీ ప్రధాన కార్యాలయంలోనే ఉంది. ట్రోఫీని విజేతకు అందించే విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు. ఈ వ్యవహారంపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, మాజీ కోశాధికారి ఆశిష్ షెలార్ ఏజీఎంలో అభ్యంతరం తెలిపారు. అయితే నఖ్వీ మాత్రం దాటవేత ధోరణి అవలంబించాడు. ''ఆసియా కప్ ట్రోఫీని అందజేయకపోవడం.. ఫైనల్ అనంతరం ఏసీసీ ఛైర్మన్ నఖ్వీ తీరు పట్ల భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. గెలిచిన జట్టుకు ట్రోఫీని అప్పగించాలని శుక్లా, షెలార్ స్పష్టంగా చెప్పారు. ఇది ఏసీసీ ట్రోఫీ అని.. వ్యక్తికి చెందినది కాదని తెలిపారు. దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయని నఖ్వీ.. దాటవేత ధోరణి ప్రదర్శించాడు. ఈ విషయాన్ని ఏజీఎంలో చర్చించకూడదని.. వేరే సమయంలో విడిగా ప్రస్తావించాలని నఖ్వీ సూచించాడు. వైస్ ఛైర్మన్ ఎన్నికే ఈ భేటీ ఏకైక అజెండా కాగా.. అది కూడా వాయిదా పడింది'' అని ఏసీసీ వర్గాలు తెలిపాయి.

# ఈ పరుగు కొంచెం కొత్తగా..



దిల్లీ: దిల్లీ వీధుల్లో పరుగు కొత్తగా అనిపించిందని దిగ్గజ అథ్లెట్ ఉసేన్ బోల్ట్ అన్నాడు. భారత పర్యటనలో ఉన్న బోల్ట్.. మంగళవారం పాత దిల్లీలోని ఖారి బావ్లీ మార్కెట్‌లో పరుగెత్తుతూ సందడి చేశాడు. అతడితో పాటు బ్యాడ్మింటన్ తార పి.వి.సింధు, హాకీ స్టార్ పీఆర్ శ్రీజేశ్, స్ప్రింటర్ అనిమేశ్ కుజుర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పురాతనమైన ఖారి బావ్లీ కట్టడంపైన ఈ నలుగురు ఫోజులిస్తూ అభిమానులను అలరించారు. సింధు, శ్రీజేశ్, అనిమేశ్.. బోల్ట్ శైలి సంబరాలను అనుకరించారు. ''పాత దిల్లీలో సుగంధ ద్రవ్యాలకు ప్రసిద్ధి చెందిన ఖారి బావ్లీలో పరుగెత్తడం కొత్తగా ఉంది. ఇలాంటి అనుభవం ఇదే తొలిసారి'' అని బోల్ట్ అన్నాడు

# పట్నాపై తెలుగు టైటాన్స్ విజయం



**చెన్నై: ప్రో కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ మెరిసింది. విజయ్ మలిక్ (13) సత్తా చాటడంతో మంగళవారం 37-28తో పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది. టైటాన్స్ జట్టులో మలిక్‌తో పాటు భరత్ (8) రాణించాడు. ఆ జట్టుకు ఇది వరుసగా మూడో విజయం. పట్నా తరఫున అయాన్ (13) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తెలుగు టైటాన్స్ (12) జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరుకుంది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ 49-44తో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. పుణెరి జట్టులో ఆదిత్య షిండే (18) అదిరే ప్రదర్శన చేశాడు. దేవాంక్ (25) మెరిసినా బెంగాల్‌కు పరాజయం తప్పలేదు.**